



టీడీపీలో.. జోష్

- నరసరావుపేట, చీరాల స్థానాలపై ఉత్కంఠకు తెర
- లోక్‌సభతో పాటు రెండు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన
- ఇప్పటికే ప్రకటిత స్థానాల్లో ప్రచారాల్లో దూసుకెళ్తున్న అభ్యర్థులు

ఖరారైన టీడీపీ అభ్యర్థులు

ఎన్నికల బరిలో నిలిచే టీడీపీ కూటమి అభ్యర్థులు అందరూ ఖరారయ్యారు. దీంతో టీడీపీ కూటమి శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇప్పటికే ఖరారైన అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తుండగా.. తాజాగా పెండింగ్‌లోని అభ్యర్థులను కూడా చంద్రబాబు ఖరారు చేశారు. ఈ మేరకు అటు అసెంబ్లీ.. ఇటు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం చంద్రబాబు ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థులతో పాటు పెండింగ్‌లో ఉన్న నరసరావుపేట (పల్నాడు), చీరాల(బాపట్ల) అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేది ఎవరో తేలిపోయింది. తాజాగా ప్రకటించిన మూడో జాబితాతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలోని అన్ని స్థానాల్లో బరిలో నిలిచే టీడీపీ కూటమి అభ్యర్థులు ఖరారైనట్లే. ఖరారైన అభ్యర్థులను కూటమి పార్టీల శ్రేణులు, నాయకులతో పాటు వివిధ వర్గాల ప్రజలు కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో శనివారం నుంచి మరింత ఊపుగా ప్రచార కార్యక్రమాల్లో దూసు కెళ్లేందుకు అభ్యర్థులు సమాయత్తమయ్యారు. మూడు జిల్లాల్లోని అన్ని స్థానాల్లో అభ్యర్థులు ఖరారుతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ఆయా అభ్యర్థుల అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

(గుంటూరు, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట లోక్‌సభ స్థానాలతో పాటు, మూడు జిల్లాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి తరఫున బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారయ్యారు. ఇప్పటికే వైసీపీ తమ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఎన్నికల రణక్షేత్రంలో ఒకరినొకరు ఢీ కునేందుకు ఆయా అభ్యర్థులు సమాయ త్తమయ్యారు. గుంటూరు జిల్లాలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలు, బాపట్ల జిల్లాలో ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీలు, పల్నాడులో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాల్లో ప్రధాన పార్టీలు అభ్యర్థులను బరిలో దింపాయి. అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీలు ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే బాబు భరోసా ద్వారా టీడీపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రచార పర్వంలో తెలుగు తమ్ముళ్లు దూసుకుపోతున్నారు. గడపగడపకు వైసీపీ పేరుతో ఆ పార్టీ అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేనల్లోకి వైసీపీ నుంచి భారీగా వలసలు జరుగుతున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే ప్రధాన అజెండాగా టీడీపీ నాయకులు పనిచేస్తున్నారు. తమను గెలిపిస్తే నియోజకవర్గానికి చేయబోయే అభివృద్ధి పనులను వివరిస్తూ టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక వైసీపీలో కొన్ని నియోజకవర్గాల్లో అసమ్మతి అభ్యర్థులకు ప్రతిబంధకంగా మారింది.

బాపట్ల బరిలో.. విశ్రాంత ఐపీఎస్



- టీడీపీ లోక్‌సభ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్
- గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్పీగా రెండేళ్లు విధులు

బాపట్ల / గుంటూరు : రాజకీయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వివిధ రంగాల్లో ఉన్న వారికి అవకాశం కల్పిస్తూ వస్తున్న టీడీపీ ఈ దఫా విశ్రాంత ఐపీఎస్ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను బాపట్ల ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. దళిత సామాజిక వర్గానికి చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్పీ నుంచి డీజీపీ స్థాయి వరకు వివిధ హోదాల్లో 34 ఏళ్ల విధులు నిర్వహించి సమర్థవంతమైన, అంకితభావం కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం పరిధిలోని రాజోలు ఆయన తండ్రి సుబ్బయ్య స్వస్థలం. ఆయన తల్లి విజయలక్ష్మిది రాజానగరం పరిధిలోని వడసలేరు గ్రామం. కృష్ణప్రసాద్ వరంగల్ నిట్‌లో బీటెక్, అహ్మదాబాద్ ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేశారు. 1986లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. లా డిగ్రీ పూర్తి చేసిన ఆయన సస్టైనబుల్ అర్బన్ మొబిలిటీ అనే అంశంపై డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అండ్ డీజీపీ హోదాలో 2020 మార్చిన ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేనప్పటికీ గతంలో టీడీపీలో ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా ఉన్న శమంతకమణి కుమార్తె శిరీష భర్తే తెన్నేటి కృష్ణ ప్రసాద్. ఎన్‌కౌంటర్లు వద్దు లొంగుబాట్లే ముద్దు అనే నినాదంతో ఆయన ఎస్పీగా, డీఐజీగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికమౌలిక వసతుల కార్పొ రేషన్ (ఏ పీఐఐసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయం లోనూ ఆయన అనేక పారిశ్రామి కీకరణ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. హైదరాబాదు ఔటర్ రింగ్ రోడ్డు ఫైనాన్షియల్ జిల్లా, కృష్ణపట్నం, గంగవరం పోర్టు వంటి పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన రూపకల్పన చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు 1996-98లో ఎస్పీగా పని చేసిన సమయంలో రౌడీ షీటర్లను సమర్థవంగా అణిచివేశారు. వరదలతో డెల్టా ప్రాంతం అతలాకుతలమవగా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె పరిధిలోని లంకల్లోకి పడవలో స్వయంగా వెళ్లి సహాయ కార్యక్రమాలు అందించారు. కేపీ ఫౌండేషన్, మలుపు అనే పేర్లతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోవిడ్ సమయంలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్, కేపీ ఫౌండేషన్ సంయుక్తంగా 16 వేల ఆక్సిజన్ వెంటిలేటర్స్‌ను అందజేశారు. 23చోట్ల 100 పడకల ఆస్పత్రులను నిర్మించారు. సైబర్ నేరాలపై అవగాహనకు ఆయన గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ పాఠశాలను ప్రారంభించారు.

ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి..

ఉద్యోగ విరమణ తర్వాత కేపీ ఫౌండేషన్, మలుపు అనే పేర్లతో సేవా కార్యక్రమాలు నిర్వహించాను. ఇంకా మరింత విస్తృతంగా ప్రజలకు సేవలు అందించాలనే దృక్పథంతోనే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయిం చుకున్నాను. టీడీపీ ఆ అవకాశం ఇచ్చింది. పార్టీ పటిష్టతకు, అదే విధంగా ఈ పార్టీ ద్వారా ప్రజా ప్రతినిధిగా లోక్‌సభలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించడమే ధ్యేయం.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(శనివారం)
సహోరీ (ఉదయం) 4.53 (ఆదివారం)

గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా.. డాక్టర్ పెమ్మసాని



టీడీపీ గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేరుని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. డాక్టర్ చంద్రశేఖర్ తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో పెమ్మసాని సాంబశివరావు, సువర్చల దంపతుల కుమారుడు. ఆయన సతీమణి శ్రీరత్న కూడా వైద్యురాలే. చంద్రశేఖర్ తండ్రి సాంబశివరావు నరసరావుపేటలో స్థిరపడి హోటల్ వ్యాపారం నిర్వహించేవారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పెమ్మసాని కుటుంబీకులు పార్టీలో కొనసాగుతున్నారు. చంద్రశేఖర్ పదో తరగతి వరకు నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్ గుంటూరులో, పూర్తి చేశారు. 1993-94లో ఎంసెట్‌లో 27వ ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. పీజీ పూర్తి చేసిన తర్వాత అమెరికాకి వెళ్లి అక్కడ యూనైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ పరీక్ష (యూఎస్ఎంఎల్ఈ) పూర్తి చేశారు. అప్పట్లోనే ఆయనకు శిక్షణ కోసం రూ.5 వేల అమెరికన్ డాలర్లను వెచ్చించాల్సి వచ్చింది. తనలా అమెరికాకి వచ్చే వారు ఎవరూ ఇబ్బంది పడకూడదని భావించి శిక్షణ కోసం తాను రూపొందించుకున్న నోట్స్‌ని ముద్రించి అందరికి ఉపయోగపడాలని సంకల్పించారు. అమెరికాలో సాఫ్టువేర్ రంగం ఊపందుకున్న తరుణంలో ఆ పుస్తకాన్ని కంప్యూటరీకరించి అంతర్జాలంలో ఉంచారు. వైద్యవిద్య రంగం నుంచి ఈ పుస్తకానికి అపూర్వ మైన స్పందన రావడం డాక్టర్ పెమ్మ సాని జీవితం కొత్త మలుపు తీసుకునేలా చేసింది. అమెరికాలో పోస్టు గ్రాడ్యూయేషన్ పూర్తి చేసి వైద్య విద్యాబోధకుడిగా, ఫిజీషియన్‌గా సేవలందించారు. అమెరి కాలో లైసెన్సింగ్ ఎగ్జామ్స్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం యూవరల్డ్ పేరుతో ఆన్‌లైన్‌లో శిక్షణ సంస్థని స్థాపించారు. అనేక అవార్డు లు అందు కున్న ఆయన పలు మీడియా సంస్థలకు వ్యాసరచయితగా కూడా వ్యవహరిస్తున్నారు. అమెరికాలో ఉన్నా మాతృభూమిపై మమకారంతో ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామమైన బుర్రిపాలెంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం భూ మిని ఉచితంగా ఇచ్చారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చదువుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యా సేవలు అం దిస్తున్న ఎన్‌జీవో సంస్థలకు విరాళాలు అందిస్తూ సహకరిస్తున్నారు. ఎన్ఆర్ఐ వి భాగం నుంచి డాక్టర్ పెమ్మసాని అంది స్తున్న సేవలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ల నుంచి అనేకసార్లు మన్ననలు అందుకున్నారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పాదయాత్ర సమయంలో స్వయంగా చూసిన చంద్రబాబు డాక్టర్ పెమ్మసానిని రాజకీయాల్లోకి వచ్చి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆహ్వానించారు. చంద్రబాబు విజ్ఞప్తి మేరకు 2014లోనే నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పెమ్మసాని పోటీకి సిద్ధమయ్యారు. అయితే చివరి దశలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాయపాటి సాంబశివరావుకు టిక్కెట్ కేటాయించారు. అయినా పార్టీకి విధేయుడిగా కొనసాగుతూ ఉన్న ఆయనకు ఈ ఎన్నికల్లో గుంటూరు ఎంపీ స్థానం నుంచి పోటీకి అవకాశం వెతుక్కొంటూ వచ్చింది. ఆయన నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతున్నారు.

నరసరావుపేట నుంచి.. సిట్టింగే



- గతంలో వైసీపీ నుంచి ఈ సారి టీడీపీ నుంచి..
- లోక్‌సభ అభ్యర్థిగా రెండో సారి బరిలో లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట: నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రెండోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. గతంలో వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన ఆయన ఈ సారి టీడీపీ నుంచి పోటీ చేయనున్నారు. టీడీపీ అభ్యర్థిగా లావు పేరును ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఖరారు చేసింది. దాచేపల్లిలో ఇటీవల జరిగిన సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరా రు. నరసరావుపేట నుంచి గత ఎన్నికల్లో శ్రీకృష్ణదేవరాయలు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి రాయపాటి సాంబశివరావుపై 1,53,978 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎంపీగా పలు కీలక కేంద్ర పథకాలను మంజూరు చేయించడంలో విశేషంగా కృషి చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు సంబంధించి వన్యప్రాణి సంరక్షణ, అటవీ శాఖల అనుమతులు రావడం వెనుక ఆయన కృషి ఉంది. రైతుల ప్రయోజనాల కోసం ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు సాధించారు. జిల్లాలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆయన కృషి చేశారు. జిల్లాలో రెండు కేంద్రియ విద్యాలయాలు మంజూరు చేయించారు. ఈ క్రమంలో రెండోసారి కూడా ఆయన నరసరావుపేట నుంచే టిక్కెట్‌ను ఆశించారు. అయితే వైసీపీ అధిష్ఠానం ఆయనకు టిక్కెట్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాడు వైపీపీ, నేడు టీడీపీ అభ్యర్థిగా వరుసగా రెండో సారి లావు నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. పల్నాడును అభివృద్ధి పథంలో నడపడమే తన అ జెండా అని లావు తన ఎన్నికల ప్రచారంలో ప్రకటిస్తున్నారు.

లావు గురించి..

కృష్ణదేవరాయలు ఏప్రిల్ 29,1983లో జన్మించారు. గుంటూరులోని విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, నిర్మల తల్లిదండ్రులు. భార్య మేఘన నేత్ర వైద్యులు. ఆయన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులు, ఆస్ట్రేలియాలో ట్రోబ్ యూరివర్సిటీలోమీడియాస్టడీస్,ఆర్ట్స్ పూర్తి చేశారు. లావు ఎడ్యుకే షనల్ సొసైటీ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ప్రజా సేవపై మక్కువతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

రెండో సారి.. అరవిందబాబు



నరసరావుపేట: నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచేది ఎవరు.. ఎవరికి టికెట్ ఇస్తారు.. అని పార్టీ శ్రేణుల్లో కొంత కాలంగా నెలకొన్న ఉత్కంఠకు అధిష్ఠానం తెరదింపింది. బీసీ వర్గానికి చెందిన డాక్టర్ చదలవాడ అరవిందబాబును చంద్రబాబు శుక్రవారం ఖరారు చేశారు. వరుసగా రెండోసారి పోటీ చేసే అవకాశాన్ని పార్టీ కల్పించింది. 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎన్నికల అనంతరం ఆయన్ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఇన్‌చార్జిగా పార్టీ, ప్రజా వ్యతిరేక పోరాట కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. టికెట్‌ను డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్ ఆశించగా బీసీలకు కేటాయించాలని భావించిన అధిష్ఠానం అరవిందబాబు వైపు మొగ్గి ఆయన పేరును ప్రకటించింది. అధిష్ఠానం నిర్ణయాన్ని స్వాగతించిన డాక్టర్ కడియాల, నల్లపాటి రాము డాక్టర్ అరవిందబాబు విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి రెండో సారి పోటీకి అవకాశం ఇచ్చిన చంద్రబాబుకు విజయం సాధించి గిఫ్ట్‌గా ఇస్తానని అరవిందబాబు తెలిపారు.

చీరాల నుంచి.. ఎంఎం కొండయ్య



చీరాల: చీరాల నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్య కూటమి అభ్యర్థి ఎవరు అన్న ఉత్కంఠకు తెరపడింది. ఇప్పటివరకు టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎంఎం కొండయ్యకే పోటీ చేసే అవకాశం వచ్చింది. ఆయన పేరును శుక్రవారం టీడీపీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. కొండయ్య పేరు తొలి జాబితాలోనే ప్రకటిస్తారని అందరూ ఆశించారు. మొదటి రెండు జాబితాల్లో బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, బాపట్ల, వేమూరు, రేపల్లె అభ్యర్థులను ప్రకటించి, చీరాలను పెండింగ్‌లో పెట్టారు. ఈ క్రమంలో కొందరు ఆశావహులు తమకే టిక్కెట్ అంటూ వేసిన అడుగులతో శ్రేణుల్లో ఒకింత గందరగోళ పరిస్థితి నెలకొంది. తాజాగా మూడో జాబితాలో కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం కొండయ్య పేరును అధికారికంగా ప్రకటించటంతో ఉత్కంఠకు తెరపడింది. స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్యను కలసి అభినందనలు తెలిపేందుకు మూడు పార్టీల శ్రేణులు బారులుతీరాయి. సేవకులుగా పనిచేద్దాం.. సత్ఫలితాలు సాధిద్దామని కొండయ్య పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు.

మద్యం, నగదు పంపిణీలను అరికట్టాలి

- మద్యం విక్రయాలపైనే దృష్టి సారించాలి
- 30 శాతం విక్రయాలు పెరిగిన మూడు దుకాణాల సీజ్
- ఎన్నికల అధికారుల సమావేశంలో కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 22: ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు వంటి బహుమతుల పంపిణీని అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ విధానంపై ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నగదు, మద్యం, మాదకద్రవ్యాలను అరికట్టడానికి నోడల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్‌ల తనిఖీలు మరింత పెరగాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయపార్టీలు, అభ్యర్థులు ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం విక్రయాలలో 30శాతం పెరిగితే సంబంధిత దుకాణాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి అలాంటివి మూడు దుకాణాలు గుర్తించి సీజ్ చేశామన్నారు. నిబంధనల మేరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు నిఘా ఉంచాలన్నారు. జిల్లా పరిధిలోని రెండు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద పరిశీలన మరింత పెరగాలన్నారు. రైళ్లు, ఆర్టీసి బస్సులలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. గడిచిన ఆరు రోజుల్లో రూ.22.40 లక్షలు విలువైన 9 వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను, 450కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వరరావు, డీఆర్వో సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీతారామయ్య, నోడల్ అధికారులు సైదానాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రచారం చేస్తే చంపేస్తాం

- దారి కాచి.. కంట్లో కారం కొట్టి దాడి
- జనసేన నేతలపై వైసీపీ మూకలు దాడి
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఆగని అరాచకాలు

నరసరావుపేట, మార్చి 22: టీడీపీ తరఫున ప్రచారం చేస్తే చంపేస్తాం.. ప్రచారం చేసేంత మగాళ్లారా మీరు.. మీ అంతు చూస్తాం.. అంటూ వైసీపీ మూకలు చెలరేగిపోయాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తరపున ప్రచారం చేస్తున్న జనసేన నేతలే లక్ష్యంగా దాడికి పాల్పడి భయభ్రాంతులకు గురి చేసిన ఘటన గురువారం రాత్రి మండలం జంగమహేశ్వరపాడులో చోటుచేసుకుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార పార్టీ రౌడీ మూకలు ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందనేందుకు ఈ ఘటన ఓ నిదర్శనం. మాచర్లలో ఇటీవల టీడీపీ నేత కారుకు నిప్పు పెట్టి దహనం చేసిన సంఘటన మరువక ముందే దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో జనసేన నేతలపై వైసీపీ నేత మన్నెయ్య పోలీసు పికెట్ సమీపంలోనే దాడి చేసి కారును ధ్వంసం చేశారు. మండలంలోని మించాలపాడుకు చెందిన జనసేన నేతలు దుర్గికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న జంగమహేశ్వరపాడుకు చెందిన ఊరిబండి మన్నెయ్య, ఆయన సోదరుడు ఏగయ్యతోపాటు సుమారు 20 మంది, మరికొంత మంది మహిళలు కాపు కాచారు. అర్ధరాత్రి సమయంలో జనసేన నేతలు తిరిగి తమ స్వగ్రామం వెళ్తుండగా జంగమహేశ్వరపురం గ్రామం నడిబొడ్డున రాళ్లు అడ్డుగా పెట్టి వారి వాహనాన్ని నిలిపారు. వాహనంలో ప్రయాణిస్తున్న జనసేన నేతలు పసుపులేటి ప్రసాద్, సింగంశెట్టి మధు, పసుపులేటి హనుమంతురావు, దాసరి చెన్నయ్యలను వాహనం నుంచి బయటకు లాగి కళ్లల్లో కారం కొట్టి కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఆ సమయంలో అదే ప్రాంతంలోని పికెట్‌లో పోలీసులు ఉన్నా అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. జనసేన నేతల వాహనం టైర్లలో గాలి తీసి రాళ్లతో ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు అక్కడకు వచ్చి జనసేన నేతలను దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ దాడి కేసులో 20 మందిని అరెస్టు చేసినట్లు సీఐ చినమల్లయ్య తెలిపారు. అరెస్టు అయిన వారిలో వైసీపీకి చెందిన ఊరిబండి ఏగయ్య, మన్నెయ్య, రమేష్, ఆవుల రమేష్, చిన బాదరయ్య, తెల్లమేకల కల్యాణ్‌బాబు, వాసు, పేరయ్య, అంగిరేకుల రాజారావు, కాయగోగుల వెంకటేశ్వర్లు, అశోక్, కృష్ణ, ఒంటేరు నాగరాజు, నాగం గురువులు, బాజి, బాషా, గాజుల వీరాంజి, కోటయ్య, పొందుగుల బ్రహ్మయ్య, గుడిపాటి శ్రీను ఉన్నారు.



వైసీపీ నాయకుల దాడిలో ధ్వంసమైన వాహనం

ఎస్ఐపై విచారణ వేగవంతం

- వైసీపీ నేత సన్మానంపై ముమ్మర దర్యాప్తు
- బల్లికురవ పీఎస్ సీసీ ఫుటేజ ఎస్పీ కార్యాలయంలో..

బాపట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణను ఎస్పీ కార్యాలయం వేగవంతం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గురువారం వైసీపీ నేత ఒకరు స్టేషన్‌లోనే ఎస్ఐకు సన్మానం చేసిన అంశాన్ని పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణించింది. అన్ని వైపుల నుంచి విమర్శలు రావడంతో సన్మానం ఇప్పటిది కాదని ఫిబ్రవరిలో జరిగిందనే పల్లవి ఎత్తుకున్నారు. అయినా ఈ వ్యవహారాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీ ఐటీ కోర్ వింగ్ ఎస్ఐ చేత స్టేషన్ సీసీ ఫుటేజ్‌ను ఎస్పీ కార్యాలయానికి శుక్రవారం తెప్పించారు. వైసీపీ నేత చేసిన సన్మానం ఎప్పుడు జరిగిందనే అంశంపై సాంకేతికంగా నిర్ధారిస్తున్నారు. దీనికి ఇటీవల టీడీపీ సానుభూతిపరుడైన ఓ వృద్ధుడిపై దాడి చేశారనే ఆరోపణకు సంబంధించి విచారణ ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. వీటన్నింటి విషయంలో వచ్చే తుది నివేదికలను బట్టి ఎస్ఐపై చర్యల విషయంలో శనివారం ఎస్పీ నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం.

ఈసీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే రవికుమార్..

అద్దంకి నియోజకవర్గంలో ఇటీవల వెలుగుచూసిన ఫాం7ల అంశంతో పాటు, పోలీసుల అధికార దుర్వినియోగం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన వంటి అంశాలను సాక్ష్యాధారాలతో ఎన్నికల కమిషన్ దృష్టికి అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ శుక్రవారం తీసుకెళ్లారు. వీటన్నింటి నేపథ్యంలో ఈసీ కన్నెర్ర చేయకముందే బాధ్యులైన వారిపై పోలీస్ శాఖ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

మత్తు ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చారు

● 1557వ రోజుకు రైతుల ఆందోళన

తుళ్లూరు, మార్చి 22: మత్తు ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని మార్చారని 33వేల ఎకరాలు త్యాగం చేసిన అమరావతి రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు, రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు, చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1557వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు రైతు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ బ్రెజిల్ నుంచి డ్రగ్స్ తెప్పించి లక్షల కోట్లు ఎలా సంపాదించాలి అనే తపన వైసీపీ పాలకుల్లో నెలకొందని ఆరోపించారు. మొన్న విశాఖ పోర్టులో పట్టుబడిన 25వేల కిలలో డ్రగ్స్ ఇందుకు నిదర్శనమని అన్నారు. విశాఖను డ్రగ్స్ హబ్‌గా చేశారని ఆరోపించారు. మూడు రాజధానులని ఐదు కోట్ల మంది తెలుగు ప్రజలను అట్టడుగుకు తోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖను మూడింటిలో ఒక రాజధానిగా చేస్తానన్నది డ్రగ్స్ అమ్ముకోవటానికా అని ప్రశ్నించారు.అమరావతి నిర్వీర్యంతో ఆంధ్రప్రదేశ్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అమరావతి రాజధానికి భూములిచ్చారన్నారు. ఒక సామాజిక వర్గం అని దానిపై అసత్య ప్రచారం చేశారన్నారు. ఎన్ని అభాండాలు వేసినా అమరావతిని అణగదొక్కలేరన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, నెక్కల్లు, అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నిబంధనలు బేఖాతరు చేస్తున్న వలంటీర్లు

వినుకొండ, మార్చి22: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు నిబంధనలు తుంగలో తొక్కి రాజకీయపార్టీలు నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుమారుడు గిరిబాబు, నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ బంధువు కలసి శావల్యాపురం మండలం బొందిలిపాలెంలోని ఇన్‌చార్జి సర్పంచ్ ఇంట్లో గురువారం రాత్రి వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు, ఇద్దరు షాడో వలంటీర్లు, ఒక ఆర్బీసీ ఉద్యోగి హాజరయ్యారు. వారంతా నాయకులతో మాట్లాడుతున్న క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఫొటోలు, వీడియోలు తీశారు. దాన్ని గమనించిన ముగ్గురు వలంటీర్లు తాము రాజీనామాలు చేస్తున్నట్లుగా శుక్రవారం ఉదయాన్నే ఎంపీడీవో కవితాచౌదరికి లిఖితపూర్వకంగా లేఖలు సమర్పించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం అధికారులు స్పందించి తగినచర్యలు తీసుకోవాలని కోరారు.

గురజాల అభివృద్ధికి సూపర్ సిక్స్

● ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చుతా ● నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 21: గురజాల నియోజకవర్గ అభివృద్ధికే కట్టుబడి నియోజకవర్గ ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేయడం జరుగుతుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ స్థాయి సూపర్ సిక్స్ మొదటి విడత పథకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గురజాల ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతగా పార్టీ మేనిఫెస్టోతో పాటు తాను సొంతంగా మేనిఫెస్టోతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చూస్తున్నానన్నారు. గురజాల నియోజకవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డి వచ్చాక 11 మంది హత్యకు గురికావడం, 8 మంది చిన్నారులు మైనింగ్ క్వారీలతో మృత్యువాత పడటంతో పాటు మహిళల అత్యాచారాలు, దోచుకో.. దాచుకో అన్నట్టుగా నియంత పాలన జరిగిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేయడమే కాకుండా మూడుముక్కలాట పేరుతో రాజధాని ఎక్కడో ఒక్కరికి కూడా అర్థం కావడం లేదన్నారు. విశాఖలోని రుషికొండను బోడిగుండు చేసి వేల కోట్ల రూపాయలతో విలాసవంతమైన భవనాలు కట్టుకున్న జగన్ పేదవాడు ఎలా అవుతాడన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా రాష్ట్రంలో 151 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని పల్నాడు జిల్లా పరిధిలోని ఎంపీ, ఏడు అసెంబ్లీ సీట్లు కూడా గెలవనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, గతంలో కొన్ని పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన మాదిరిగానే రేపటి ఎన్నికల తరువాత ఇప్పుడు హామీ ఇస్తున్న ప్రతి పథకాన్ని అమలు చేసి తీరుతామన్నారు. మరో నాలుగు రోజుల్లో రైతులకు ఉపయోగపడే పథకాలు, సంక్షేమం, విద్య, వైద్యంపై మరో మేనిఫెస్టోను ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు చర్చిల పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏప్రిల్ 10వ తేదీలోపు పూర్తిస్థాయి గురజాల మేనిఫెస్టోను ప్రకటిస్తానని యరపతినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబావలి, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, గండికోట వెంకటేశ్వర్లు, కనిగిరి శ్రీను, తురకా వీరస్వామి, అమీర్‌అలి, దియ్యా రామకృష్ణ, పాండురంగ శ్రీను, మందా డేవిడ్, చల్లగుండ్ల బాబు, పణితి రవి, చెన్నారావు, నెల్లూరి శివనాగేంద్రం, పాదర్తి రాజేశ్వరి, నజీమూన్, బెల్లంకొండ భద్రి, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, బడిగుంచల వెంకటేశ్వర్లు, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, అడపా శ్రీను, తదితరులున్నారు.



ఎస్సీ సామాజికవర్గ నేతలతో కలిసి గురజాల సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ప్రకటిస్తున్న గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

గురజాల సూపర్ సిక్స్ పథకాలు..

● 800 ఏళ్ల చరిత్ర వున్న పల్నాడులోని గురజాల కేంద్రంగా నూతనంగా జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడం

● నారా లోకేష్ యువగళం స్ఫూర్తిగా యూత్ పాలసీ ద్వారా నియోజకవర్గంలో మినీ సెజ్‌ల ఏర్పాటు ద్వారా 15 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం

● టీడీపీ మేనిఫెస్టోలో ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికి పంపిణీతో పాటు ఐదేళ్లలో ప్రతి ఇంటికి ఒక గ్యాస్ సిలిండర్‌ను తాను కూడా ఉచితంగా పంపిణీ చేయడం

● టీడీపీ హయాంలో వున్న చంద్రన్న బీమా 5 లక్షల పరిధి నుంచి 10 లక్షల వరకు పెంచడంతో పాటు గురజాల నియోజకవర్గంలో లక్షన్నర కుటుంబాలకు చంద్రన్న బీమా ప్రీమియంను తానే స్వయంగా చెల్లింపు చేయడం జరుగుతుంది.

● ముస్లిం సోదరులను ఇప్పటికి 48 మందికి లక్ష రూపాయలు చొప్పున ఒక్కొక్కరికి అందించి హజ్‌యాత్రకు పంపడం జరిగింది. ఎన్నికల తరువాత హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు లక్ష రూపాయలు వ్యక్తిగతంగా సాయమందిస్తా

● ఏసుప్రభు మాలలు ధరించిన క్రిస్టియన్ సోదరులు వేళాంగణిమాత దర్శనం కొరకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

60 రోజుల్లో అరాచక పాలన అంతం: ధూళిపాళ్ళ



పద్మశాలీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, మార్చి22: రానున్న 60 రోజుల్లో రాష్ట్ర ప్రజలు అరాచక వైసీపీ పాలనకు స్వస్తి పలుకుతున్నారన్ని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో పద్మశాలీల సంఘం ఆత్మీయ సమావేశంలో నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి ఆయనకు తెలియజేసారు. టిడ్కో గృహాలకు ఐదేళ్ల క్రితం తమ వాటా చెల్లించిన్నప్పటికి నేటి వరకు గృహాలు అందచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు వార్డులో మంచినీరు రావటం లేదన్ని కాల్వలు, రహదారులు నిర్మించలేదని తెలిపారు. అనంతరం నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులైన పెమ్మశాని చంద్రశేఖర్‌ను, తనను గెలిపించాలన్ని విజ్ఞప్తి చేశారు. 60 రోజులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందన్ని అరాచక పాలనకు విముక్తి లభిస్తుందన్ని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పద్మశాలీల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దే

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 22: విశాఖపట్నంలో డ్రగ్స్ పట్టివేతపై సమగ్ర విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేల కోట్ల విలువైన డ్రగ్స్ విశాఖపట్నంలో పట్టుబడటం ఆందోళనకరం అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే గంజాయి ఊరువాడ వ్యాపించిందన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో విజయవాడ అడ్రస్‌తో వేల కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ వస్తే నేడు వైజాగ్ పోర్టుకు వేల కోట్ల విలువైన డ్రగ్స్ వచ్చాయన్నారు. డ్రగ్స్ కంటైనర్‌ను తెరవకుండా ఒత్తిడి చేసిన నాయకులు, అధికారుల పై కూడా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలన్నారు. సీబీఐ అధికారులు తనిఖీలు చేయకుండా అడ్డుకున్న వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాలు వ్యాప్తి చెందటం ఆందోళనకరం అన్నారు. దీనికి వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు.

పట్టపగలే రూ.28 లక్షల విలువైన నగల చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

నాదెండ్ల, మార్చి 22: పట్టపగలే ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు రూ.28 లక్షలు విలువ చేసే బంగారు నగలను చోరీ చేసిన ఘటన మండలంలోని సాతులూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన మాజేటి ప్రవీణ్ విజయ కుమార్ బయ్యనవారి బజారులో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో ఒక రైస్ మిల్లులో భాగస్వామిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన భార్య కవిత కూడా ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఒంటిపూట బడులు కావటంతో ఉదయం 8 గంటలకే పాఠశాలకు వెళ్ళింది. ఇంటర్ చదువుతున్న కుమారుడు పార్దు 11 గంటలకు ఇంటికి తాళం వేసి మిల్లులో ఉన్న తన తండ్రికి తాళం ఇచ్చాడు. మధ్యాహ్నం 12 గంటల తరువాత స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కవిత తలుపుల తాళాలు పగల గొట్టి ఉండటాన్ని చూసి అవాక్కైంది. ఇంటిలోకి వెళ్ళి చూడగా బీరువా కూడా తెరిసి ఉండటాన్ని చూసిన ఆమె భర్తకు ఫోన్ చేసింది. బీరువాలోని 456 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.50వేల నగదు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బాల రామిరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విషయాన్ని క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. క్రైం ఎస్ఐ లోకేశ్వరరావు, క్లూస్ టీమ్ సభ్యులు వేలి ముద్రలను సేకరించారు. సాయంత్రం సంఘటనా స్థలాన్ని నరసరావుపేట డీఎస్పీ వర్మ, ట్రైనింగ్ డీఎస్పీ జగదీష్, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు సందర్శించారు.

గుంటూరు మీదగా హోలీ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోలీ పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపన్నున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07645 సికింద్రాబాద్ - సంత్రగచి ప్రత్యేక రైలు ఈ నెల 23వ తేదీన(శనివారం) రాత్రి 9.05కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ఆదివారం అర్ధరాత్రి దాటాక సోమవారం ప్రారంభ సమయం 12.15 గంటలకు సంత్రగచి చేరుకొంటుంది. నెంబరు.07646 సంత్రగచి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 25వ తేదీ సోమవారం వేకువజామున 5.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మంగళవారం ఉదయం 8.10కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

బాలికపై కానిస్టేబుల్ అత్యాచారయత్నం

● దేహశుద్ధి చేసి స్టేషన్‌లో అప్పగించిన స్థానికులు



దేహశుద్ధి అనంతరం కానిస్టేబుల్ రవి

క్రోసూరు, మార్చి 22: మతిస్థిమితం లేని బాలికపై సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవి అత్యాచార యత్నానికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం బాలికను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వేల్పూరు రోడ్డువైపు వెళ్తుండగా స్థానికులు గమనించారని, చిన్న కాలువ వద్ద అత్యాచార యత్నానికి ప్రయత్నించగా వెంబడించిన స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. మద్యం సేవించి ఉన్న కానిస్టేబుల్‌ను ఆటోలో తీసు కువచ్చి క్రోసూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. కొంతకాలం క్రితం వరకు క్రోసూరు పోలీసు స్టేషన్‌లో పనిచేసిన రవికి ఇటీవలే సత్తెనపల్లి బదిలీ అయింది. గతంలో కూడా అతనిపై పలు వివాదాలు ఉన్నాయి. సీఐ మంగారావు వివరాలు నమోదు చేసుకొని చర్యలు తీసుకుం టామని చెప్పారు.

వాహనాల తనిఖీల్లో రూ.13.50 లక్షల స్వాధీనం

చిలకలూరిపేట, మార్చి 22: చిలకలూరిపేట వద్ద గురువారం రాత్రి పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల సందర్భంగా అక్రమంగా తరలిస్తున్న రూ.13.50 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై చిలకలూరిపేట బొప్పూడి మధ్య చిన పసుమర్రు రెవెన్యూ పరిధిలో ఒక ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.రవికృష్ణ, ఎస్ఈబీ ఈఎస్ఐ శశికుమార్ తమ సిబ్బందితో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఒక ప్రయాణికుడు వద్ద రూ.13.50 లక్షలు ఉన్నట్లుగా గుర్తించారు. అతడిని నరసరావుపేటలోని గోకుల్ సీతారామయ్య నగర్‌కు చెందిన అరవపల్లి శ్రీనివాసరావుగా పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు కానీ, బిల్లులు కానీ అతడు చూపించలేదని పోలీసులు చెప్పారు. ఈ మొత్తాన్ని పల్నాడు జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారులకు పోలీసులు అందచేయనున్నారు.

భద్రతా నియమావళిని కచ్చితంగా పాటించండి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



వీసీలో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సిబ్బంది, అధికారులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సికింద్రాబాద్‌లోని రైలు నిలయం నుంచి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలన, వివిధ ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ నుంచి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. జీఎం మాట్లాడుతూ లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, గార్డులతో సహా భద్రతా సంబంధిత సిబ్బందికి తరచుగా క్షేత్ర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అనూహ్య, అత్యవసర సమయంలో సరిపడా నిల్వలు అగ్నిమాపక పరికరాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అమృత్ స్టేషన్ల ప్యాసింజర్ సౌకర్యాలు, పునరాభివృద్ధి పనులకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులపై పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

తుళ్ళూరు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం నెక్కల్లు అనంతవరం మార్గంలో జరిగింది. స్థానికులు, బంధువుల కథనం మేరకు మండలంలోని పెదపరిమి గ్రామానికి చెందిన ఎర్రమాల చందు(14) ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతవరం వరకు శిలువ ర్యాలీ ముగించుకొని తిరిగివస్తున్న క్రమంలో ఆటుగా వస్తున్న కంకరు ట్రాక్టర్‌ను వెనకాల ఎక్కబోయి పట్టుతప్పి కిందపడ్డాడు. తలకు గాయమై చందు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు ట్రాఫిక్ సీఐ ప్రభాకర్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

నకరికల్లు, మార్చి 22: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన ఇది. పోలీసుల కథనం మేరకు ఈపూరు మండలం ఇనిమెళ్ళ కి చెందిన చింతల రామకోటేశ్వరరావు(52) గురువారం రాత్రి చేజర్ల నుంచి బైక్‌పై ఇనిమెళ్ళకు బయలుదేరాడు. సాగర్ కుడికాల్వ కట్ట మీదుగా ఇనిమెళ్ళకు వెళ్తున్న అతని బైక్ అదుపుతప్పి పక్కకు పడిపోయింది. శుక్రవారం ఉదయం అటు వెళ్ళిచూడగా రామకోటేశ్వరరావు మృతి చెందినట్టు స్థానికులు గుర్తించారు. మృతుని భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

● 4.6 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొత్తపేట సీఐ అన్వర్‌బాషా, వెనుక నిందితులు వెంకటకృష్ణ, భాను ప్రకాష్

గుంటూరు, మార్చి 22: ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇరువురు నిందితులను కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం నల్లపాడు పరిధి సీతారామ్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న బెంగళూరులోని ఉత్తరహళ్ళి మెయిన్‌రోడ్డుకు చెందిన నాగవర కృష్ణ అర్జున, అదేవిధంగా సంపత్‌నగర్‌కు చెందిన విచారపు భాను ప్రకాష్‌లను అరెస్టు చేసి వారినుంచి 4కిలోల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట సీఐ అన్వర్‌బాషా తెలిపారు. ఈ నెల 21న సాయంత్రం తమకు అందిన సమాచారం నెహ్రూనగర్ రైలుపట్టాల వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారిని అరెసుట చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. ఈ కేసులోని నిందితులను పట్టుకోవడం, సమాచారం సేకరించుటలో ప్రతిభ కనబరిచిన కొత్తపేట సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ, ఈస్ట్ సబ్- డివిజన్ ఏఎస్పీలు అభినందించారు.

గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), మార్చి22: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరాని 5వ తరగతికి, 6, 7, 8 తరగతుల్లో మిగిలివున్న ఖాళీలకు ప్రవేశానికి, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ, డీసీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కార్యదర్శి ఆర్‌.నరసింహారావు పేర్కొన్నారు. విద్యార్థులు https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో పంపాలని సూచించారు.

స్కూల్ బస్సు దగ్ధం

● చిన్నారులకు తప్పిన పెను ప్రమాదం

దుర్గి, మార్చి 22: మండల కేంద్రమైన దుర్గిలోని సాయితేజ స్కూల్ బస్సు దగ్ధమైంది. శుక్రవారం మండలంలోని నెహ్రూనగర్‌తండాకు చెందిన 30మంది చిన్నారులను స్కూల్ నుంచి గ్రామానికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలోని కంచరగుంట వద్దకు రాగానే బస్సు నుంచి పొగ రావడం డ్రైవర్ రమేష్ గమనించారు. బస్సు ఆపి పిల్లలను కిందకు దింపారు. ఒక్కసారిగా పూర్తిగా మంటలు ఎగిసిపడడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. చిన్నారులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గంటకు పైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫైరింజన్‌కు ఎన్నిమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో స్థానికులు బిందెల్లో నీటిని తీసుకొచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

దగ్ధమవుతున్న స్కూల్ బస్సు



91,650 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 82,280 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 91,650 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 71,990 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19500
నెం.5	8500	16000
273	9000	18000
341	9000	18000
4884	9500	17500
సూపర్ 10	8500	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	8000	22000
దేవనూరుడీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	12000

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన



ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసిన బత్తులవారిపాలెం ఎండీయూ ఆపరేటర్ జంగిలి విజయ్‌కుమార్

కర్లపాలెం, మార్చి 22 : కర్లపాలెం మండలంలో కొంతమంది వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల అధికారులు పదేపదే చెబుతున్నప్పటికి నియమ నిబంధనలను అతిక్రమిస్తూ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ వైసీపీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించి స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. కర్లపాలెం మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీపరిధిలో బత్తులవారిపాలెంకు చెందిన ఎండీయూ ఆపరేటర్ జంగిలి విజయ్‌కుమార్ బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని పెదగొల్లపాలెం వైసీపీ నాయకులతో పాటు కలిశారు. ఈ విషయంపై ఆర్డీవో గంధం రవీందర్‌ను వివరణ అడగ్గా అతనిని విధులు నుంచి తొలిగించామన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న టి.భారతి వైసీపీకి అనుకూలంగా 50కుటుంబాల గ్రూప్‌లో వీడియోను పోస్ట్ చేసినందుకు విధులు నుంచి తొలిగిస్తున్నట్లు ఎంపీడీవో నేతాజి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విదులు నుంచి తొలిగించారు.

కులగణనపై చిన్నచూపు తగదు : కేసన



మాట్లాడుతున్న శంకరరావు

తెనాలి అర్బన్, మార్చి 22: కులగణన అవసరం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్‌శర్మ చెప్పడం సరి కాదని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కులగణన అవసరమన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం కూడా కులగణన ఆధారంగానే పరిపాలన సాగించిందన్న విషయం మరిచిపోవద్దన్నారు. పరిణితి లేని వ్యాఖ్యలు చేయబట్టే కాంగ్రెస్‌కు అధికారం కల అవుతుందని విమర్శించారు. 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం 27శాతం రిజర్వేషన్లను అమలుచేసిందని, జనాభా ప్రాతిపదికన ఆయా రంగాల్లో బీసీలకు అవకాశాలు దక్కాలంటే కులగణన తప్పదన్నారు. సమావేశంలో బీసీ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కొడాలి శ్రీనివాసరావు, వేముల కృష్ణ, మురళి, రమేష్, సాయి, మణికంఠ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00



టీడీపీలో చేరిన వెదుళ్ళపల్లి కొత్తపాలేనికి చెందిన వారితో నరేంద్రవర్మ

టీడీపీలోకి వైసీపీ నుంచి భారీ చేరికలు

● వెదుళ్ళపల్లి కొత్తపాలేనికి చెందిన 50 మందిని పార్టీలో చేర్చుకున్న నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 22 : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన 50 మంది రెడ్డి సామాజికవర్గ వైసీపీ నాయకులు శుక్రవారం తెలుగు దేశం పార్టీలో చేరారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కుంచాల సుబ్రహ్మణ్యంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేగేశన నరేంద్రవర్మ చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని భావించి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. తనను గెలిపిస్తే సేవకునిగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని, సంక్షేమఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబశివరావు, అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, వెదుళ్ళపల్లి బూత్ కన్వీనర్ షేక్ చాంద్‌బాషా, కావూరి సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెం వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

పిట్టలవానిపాలెం, మార్చి 22 : మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి నిరంకుశ పాలనకు విసుగు చెంది పార్టీలో కనీస గౌరవం లేకపోవటంతో శుక్రవారం పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో తెలుగుదేశంపార్టీ కండువాలు కప్పుకొని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కొత్తపాలెం వైసీపీ నాయకులు, కార్యకర్తలు 50 మందిని టీడీపీలోకి వేగేశన నరేంద్రవర్మ ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఎండి అఫ్జల్, నాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తపాలేనికి చెందిన మాజీ సర్పంచ్ దోమా నాగేశ్వరరెడ్డి, గుండుబోయన శ్రీనివాసరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు.

టీడీపీ మండల సమావేశం

పిట్టలవానిపాలెం, మార్చి 22 : పిట్టలవానిపాలెం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో వైసీపీ నుంచి నూతనంగా టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని పలకరించి వారి ఆశీస్సులు అందుకుంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారమే లక్ష్యంగా తన ప్రయాణం కొనసాగిస్తున్నన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ నాయకులు కళ్ళం హరినాథరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, కర్లపాలెం మండల జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, రైల్వే బోర్డు మాజీ సభ్యులు, టీడీపీనాయకులు ఎం.ఎస్.నియాజి, లక్ష్మీ సుబాషిణి, మాజీ ఎంపీపీ బొలగాని నారాయణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాశీం, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, బాపట్ల మాజీ ఎంపీపీ దాసరి యోహాను, బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కలకోట చక్రధర్‌రెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి : జేసీ

బాపట్ల, మార్చి 22 : రాజకీయపార్టీలనాయకులు ఎన్నికల ప్రచారానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, ఆర్వో సి.హెచ్.శ్రీధర్ తెలిపారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 24 గంటలలో అనుమతులివ్వటం జరుగుతుందన్నారు. సివిజిల్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 9 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందులో 5 ఫిర్యాదులపై చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. 4 ఫిర్యాదులు బ్లాక్ చేయటం జరిగిందన్నారు. ఒక వ్యక్తి 50వేలు మాత్రమే తీసుకెళ్ళాల్సి ఉంటుందన్నారు. 10లక్షలు దాటితే ఇంకంట్యాక్స్‌వారికి అప్పగించటం జరుగుతుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, స్ఫూర్తి, నిర్మలానందబాబా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్

గాయపడిన విద్యార్థికి పరిహారం అందించాలి : డాక్టర్ చార్వాక

బాపట్ల, మార్చి 22 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో దళిత విద్యార్థి బొనిగల నవదీప్‌కుమార్‌ను డ్రాయింగ్ అధ్యాపకులు కొత్తమాసు బాలాజి కొట్టి గాయపర్చటాన్ని అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక తీవ్రంగా ఖండించారు. దళిత సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవదీప్‌కుమార్‌ను పరామర్శించి ఆరోగ్యపరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, విద్యార్థి అదే కళాశాలలో చదువు పూర్తిఅయ్యే వరకు ఉంచాలన్నారు. యాజమాన్యంతోపాటు అధ్యాపకుడు బాలాజిపై 307, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమతాసైనిక్‌దళ్ రాష్ట్రాధ్యక్షులు కంచర్ల చిట్టిబాబు, దళిత గిరిజన రాష్ట్ర నాయకులు మార్పు దీన రాజు, దళితన్యాయవాదుల ఐక్యవేదిక ప్రతినిధి పొందుగల చైతన్య, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మేకా శ్యామ్ ప్రసాద్, మహిళా నాయకురాలు దాసరి లక్ష్మీ, కుమ్మరి శామ్యూల్ తదితరులు ఉన్నారు.

అధ్యాపకునిపై కేసు నమోదు చేయాలి : కేవీపీఎస్

నవదీప్‌కుమార్‌ను కొట్టి గాయపరిచిన అధ్యాపకునిపై కేసు నమోదు చేయటంతోపాటు కళాశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థిని ఆసుపత్రిలో శుక్రవారం పరామర్శించి వారు మాట్లాడుతూ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయటం సరికాదన్నారు. కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్ష,కార్యదర్శులు శరత్,జయరావు తదితరులు ఉన్నారు.

పది గణితం పరీక్షకు జిల్లాలో 745 మంది గైర్హాజరు

బాపట్ల టౌన్, మార్చి 22 : పదవ తరగతి గణితం పరీక్షకు జిల్లాలో 108 కేంద్రాలలో 18,265 మంది హాజరుకావాల్సి ఉంది. అందులో 17,520 మంది హాజరు కాగా 745 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా జిల్లాలో 96 శాతం హాజరు నమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు రేపల్లె, చీరాల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం 37 పరీక్షా కేంద్రాలలోని విద్యార్థులను తనిఖీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పిట్టలవానిపాలెం, మార్చి 22 : రానున్న పార్లమెంట్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయటంతోపాటు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయటం లక్ష్యంగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి నాయకత్వంలో పని చేయాలని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మొహిద్దీన్‌బేగ్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీలోని సంతబజారు కూడలి నందు శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు ఎవరికిచ్చినా వారి విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ సైనికులు మహ్మద్ ఆరీఫ్, మహ్మద్‌గౌస్‌బాషా, అమానుల్లా పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నగరం, మార్చి 22 : ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పూర్తి భద్రత కల్పిస్తున్నట్లు నగరం ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. నగరం క్రేందంలో పారా మిలటరీ దళాలతో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఎలాంటి భయాందోళన చెందవద్దని, పూర్తి స్థాయి భద్రత కల్పిస్తామని తెలిపారు.

టీడీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్

● ఐపీఎస్ అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలో పలు చోట్ల విధులు

● సేవలు మెచ్చి బాపట్ల ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన టీడీపీ



కృష్ణప్రసాద్

బాపట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అత్యున్నత విద్యావంతుడు, ఐపీ ఎస్ అధికారిగా ఉమ్మడి రాష్ట్ర పరిధిలో పలు జిల్లాల్లో ఎస్పీగా సేవలు, అనేక ప్రభుత్వ ప్రాజెక్టుల్లో తనదైన మార్కు.. లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం కల్పించడంలో ప్రత్యేక చొరవ.. చంద్రబాబునాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పలు ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించిన ట్రాక్ రికార్డు ఆయన సొంతం.. తెలంగాణ రాష్ట్ర రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అండ్ డీజీపీగా సమర్థవంతంగా విధుల నిర్వహణ.. పుట్టి, పెరిగింది తెలంగాణలోనే అయినా తల్లిదండ్రుల మూలాలు తూర్పు గోదావరి జిల్లాలోనే.. అనంతపురం జిల్లా అల్లుడే బాపట్ల ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం టీడీపీ ప్రకటించిన కృష్ణప్రసాద్.

తీవ్ర ఉత్కంఠ రేపిన బాపట్ల ఎంపీ సీటు ఖరారు విషయంలో తెలుగుదేశం ఎట్టకేలకు తెరదించింది. ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్(ఎస్సీ మాదిగ)ను టీడీపీ ప్రకటించింది. చీరాల సీటు విషయంలో కొనసాగుతున్న సందిగ్ధానికి కూడా తెర దించుతూ ఎంఎం. కొండయ్య పేరునే ఖరారు చేసింది. దీంతో బాపట్ల ఎంపీ సీటుతో సహా మొత్తం ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను టీడీపీ ప్రకటించినట్లైంది.

కుటుంబ నేపథ్యం...

1960 మార్చి 2న జన్మించిన తెన్నేటి కృష్ణప్రసాద్ తండ్రి స్వస్థలం అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు కాగా, తల్లిది తూర్పుగోదావరి జిల్లా వడిసలేరు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ మంత్రి శమంతకమణి కూతురు శిరీషనే వివాహం చేసుకున్నారు

అంచెలంచెలుగా...రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీపీగానే రిటైర్డ్

కృష్ణప్రసాద్ వరంగల్ నిట్‌లో బీటెక్ పూర్తి చేశారు. అహ్మదాబాద్ ఐఐఎంలో ఎంబీఏ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పట్టా అందుకున్నారు. అక్కడే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. తెలంగాణ కేడర్ ఐపీఎస్‌గా సేవలందించిన ఆయన నెల్లూరు, వైజాగ్, గుంటూరు, మెదక్ జిల్లాల ఎస్పీగా పనిచేశారు. వరంగల్, వైజాగ్ రేంజ్ డీఐజీతో పాటు విజయవాడ సీపీగా కూడా విశేష సేవలందించారు. 1998-99కాలంలో గుంటూరు ఎస్పీగా పని చేసిన కృష్ణప్రసాద్, 2018--20 వ్యవధిలో తెలంగాణ రాష్ట్ర రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ విభాగానికి డీజీపీగా సేవలందించారు. అదే సంవత్సరం మార్చిలో ఆయన పదవీ విరమణ చేశారు

సరెండర్ స్పెషలిస్టుగా పేరు...

తెలంగాణ జిల్లాల్లో పోలీస్ అధికారిగా పని చేసిన కాలంలో వందల సంఖ్యలో నక్సల్స్ లొంగుబాటులో కీలకపాత్ర పోషించారు. వారందరికీ పునరావాసం కల్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్న పేరుంది. ఇదేకాకుండా పలు ప్రభుత్వ ప్రాజెక్టుల విజయవంతంలో తనదైన పాత్ర పోషించి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు

నేడు బాపట్లకు రాక...

టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన తెన్నేటి కృష్ణప్రసాద్ శనివారం బాపట్లకు రానున్నారు. పార్టీ శ్రేణులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా మర్యాదపూర్వకంగా ఆయన కలవనున్నారు.

నీరులేనిదే మానవ మనుగడ లేదు

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న వ్యవసాయకళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల, మార్చి 22 : నీరులేనిదే మానవ మనుగడ లేదని, నీటికొరకు యుద్ధాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు. తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రాణమి, సాయిల్‌సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ జలదినోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సేద్యవిభాగాధిపతి డాక్టర్ కె.చంద్రశేఖర్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, డాక్టర్ పీవీఎన్ ప్రసాద్, డాక్టర్ కె.హేమ, డాక్టర్ వి.సీతారాంబాబు, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ సిద్ధార్థ నాయక్, డాక్టర్ బి.సురేష్‌కుమార్, డాక్టర్ బి.గౌతమి, డాక్టర్ జి.శ్రావణలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో...

డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో శుక్రవారం ప్రపంచ జలదినోత్సవ కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్. ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. జలమే జీవనాధారం, జలం లేనిదే జీవంలేదని ఆయన వివరించారు. నీటి ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. సీనియర్ ప్రొఫెసర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో...

బాపట్ల, మార్చి 22 : మానవాళి జీవనాధారమైన నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ అన్నారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ జలదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల రోటరీక్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలను గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై సమాజంలో ప్రచారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, కార్యదర్శి ఉపేంద్రగుప్తా, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మీ, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ జి.రవిబాబు, రతన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో...

బాపట్ల టౌన్, మార్చి 22 : నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జలదినోత్సవంలో భాగంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, మెరైన్ పోలీసులు సూర్యలంకతీరంలో ప్రజలు, పర్యాటకులకు నీరు పొదుపుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రజలకు తాగునీరు ఎంతో అవసరమని నీటిని వృధా, కలుషిత కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నిరంజన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజేంద్ర, వై.శృతి, అధ్యాపకులు కృష్ణ, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు నామినేషన్లు

రేపల్లె, మార్చి 22 : రేపల్లె బార్ అసోసియేషన్ హాలులో నామినేషన్ల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేపల్లె అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా న్యాయవాది వై.ధర్మతేజ నామినేషన్ పత్రాన్ని ఎలక్షన్ ఆఫీసర్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్‌కు అందజేశారు. ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో పోషణ్ పక్వాడ

వేమూరు, మార్చి 22 : మండలంలోని జంపని దళితవాడలో మండల పరిషత్ ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ విభాగం అధికారి డాక్టర్ శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులకు ఆరోగ్య విషయాలపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రాప ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు నాగ సుధ, ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, ఆయుష్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీ

వేమూరు, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వేమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తెనాలి-వేమూరు మార్గ మధ్యంలో వేమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని యడవూరు క్రాస్ రోడ్డు వద్ద, వేమూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రత్యేక పోస్టు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఎస్సై రాజశేఖర్ స్టేషన్ పరిధి సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేశారు.

పకడ్బంధీగా ఎన్నికల కోడ్ అమలు

కొల్లూరు, మార్చి 22 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బంధీగా అమలు చేస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకుమారి, తహసీల్దార్ పుల్లారావు అన్నారు. శుక్రవారం పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాల్లో ఆయా రాజకీయ పార్టీల ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, గుర్తులు పైకి కనిపిస్తున్నట్లుగా సమాచారం అందడంతో ఎంపీడీవో, తహసీల్దార్ ఆయా గ్రామాలకు వెళ్ళి తమ సిబ్బందితో ఆనవాళ్ళను తొలగించడంతో పాటు, శిలాఫలకాలు పేపర్లను దగ్గరుండి అతికింపజేశారు. ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరిగినట్లు ప్రజలు గుర్తిస్తే తమకు వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని వారు అన్నారు.

రేపు లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల

కొల్లూరు, మార్చి 22 : గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మండల పరిధిలోని దోనేపూడి లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి వార్షిక కల్యాణం తిరునాళ్ళ మహోత్సవం ఈనెల 24న జరగనుండటంతో ఆలయానికి విద్యుత్ దీపాలు అలంకరించి ముస్తాబు చేశారు. తిరునాళ్ళను పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచే ట్రాఫిక్ మరో మార్గంలో మళ్ళించే ఏర్పాట్లును చేస్తున్నారు. తిరునాళ్ళను పురస్కరించుకుని దోనేపూడి, పెసర్లంక గ్రామాల్లో శనివారం పర్యటించి బందోబస్తు కావాల్సిన ఏర్పాట్లు పరిశీలిస్తామని రేపల్లె డిఎస్పీ టి.మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. గత తిరునాళ్ళలో ఘర్షణలు చోటు చేసుకున్నట్లు తన దృష్టికి రావడంతో ఈసారి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు శ్రీనివాస కల్యాణమహోత్సవం

బాపట్ల,మార్చి 22 : శ్రీలక్ష్మీజయంతిని పురస్కరించుకొని శ్రీ లలితత్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో బాపట్ల చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న శ్రీ పాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం శ్రీనివాస కల్యాణం, సామూహిక సౌభాగ్యప్రద కుబేర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ పండితులు, నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. సోమవారం ఉదయం శ్రీలక్ష్మీజయంతి సందర్భంగా అభిషేకం, పుష్పయాగ మహోత్సవం, పద్మ పుష్ప యుక్త ఐశ్వర్యప్రద శ్రీలక్ష్మీహోమం జరుగుతుందన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ నక్కా అఖిలేష్

తెలుగుదేశంతోనే యువతకు భవిత : అఖిలేష్

చుండూరు మార్చి 22 : రాష్ట్రంలో యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తనయుడు నక్కా అఖిలేష్ అన్నారు. పెనుకుదురుపాడులో సూపర్ 6 పథకాలపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అఖిలేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో ఉపాధి అవకాశాలు ఎండమావులుగా మారిపోవడంతో ఎక్కువ మంది విద్యావంతులైన యువకులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే భావనతో ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెళ్ళి చాలీచాలని వేతనాలతో జీవనం సాగించవలసిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యువతకు మంచి భవిష్యత్ కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అఖిలేష్ కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ సర్పంచ్ బుజ్జి పాల్గొన్నారు.

యశోద మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, మార్చి 22 : మాజీ కౌన్సిలర్ అంతిరాజుల యశోద మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని రెల్లీ కాలనీలో శుక్రవారం యశోదమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 8వ వార్డు కౌన్సిలర్‌గా విధులు నిర్వహించి వార్డు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, గుర్రం మురహరిరావు, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి

రేపల్లె, మార్చి 22 : ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె అర్బన్ సూపర్ వైజర్ శివజ్యోతి అన్నారు. పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించేందుకు పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చించి పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగం వాణిశ్రీ, కె.పద్మావతి, డి.శివపార్వతి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ



వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మార్చి 22 : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 9021 మందిపై బైండోవర్ చేసి ముమ్మర తనిఖీలు చేపట్టామన్నారు. 18 ఫ్లయింగ్ స్క్వాడ్, 20 ఎంసిసి, 18 ఎస్ఎస్‌టి, 164 సెక్టార్ ఆఫీసర్స్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచి బృందాలు నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని ఇప్పటికి 49 లక్షల రూపాయల విలువైన మద్యం, రూ.25 లక్షల విలువైన గంజాయి, రూ.2.44 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 137 లైసెన్స్ తుపాకులు ఉండగా వాటిలో 75 ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని మిగిలిన 62 బ్యాంక్ అథారిటీల వద్ద ఉన్నాయని తెలిపారు. ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా ఆయుధాలు కలిగియున్న, ప్రదర్శించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 919 ప్రాంతాలలో 1510 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని వాటిలో 226 చోట్ల ఉన్న 332 పోలింగ్ స్టేషన్‌లను సమస్యాత్మకంగా పరిగణించగా మిగిలిన 657 ప్రాంతాలలోని 1178 పోలింగ్ స్టేషన్‌లను సాధారణ పోలింగ్ స్టేషన్‌లుగా పరిగణించబడ్డాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ప్రజలు స్వేచ్ఛాయుతంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవటానికి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే బి.ఎస్ఎఫ్ దళాలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల నియమావళికి లోబడే పని చేయాలి : జేసీ



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న రేపల్లె ఆర్డీవో హేలా సోరాన్

చెరుకుపల్లి, మార్చి 22 : ఎన్నికల నిబంధనల ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ నిబంధనలు ఉల్లంగించకుండా కార్యక్రమాలు నిర్వహించాలని రేపల్లె ఆర్డీవో హేలా సోరాన్ అన్నారు. శుక్రవారం చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటి చట్టాలకు లోబడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండలంలో వివిద పార్టీలు చేసే కార్యక్రమాలను 24గంటల ముందే అనుమతి తీసుకుని ప్రచార సభల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

భట్టిప్రోలు, మార్చి 22 : ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని మండల తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి అన్నారు. ఓటు హక్కు నమోదుపై స్థానిక కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం అవ గాహనా ర్యాలీ నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, సీసీలు కె.రజనీకుమారి, హనోక్, అకౌంటెంట్ శిరీష, సర్వేయర్ బాబూరావు, వీఆర్ఓలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నమాను వాహనంపై దర్శనమిచ్చిన మల్లేశ్వరుడు

భట్టిప్రోలు, మార్చి 22 : శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగం గా మూడవ రోజు శుక్రవారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యహోమం అనంతరం రాత్రి శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్లు పొన్నమాను వాహనంపై దర్శనమిచ్చారు. అద్దేపల్లికి చెందిన తిరువీధుల బాలాజి, శ్రీధర్‌లు చేయించిన పొన్నమాను వాహనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి స్వామివారిని ఆశీనులను గావించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము వరకు సాగిన పొన్నమాను గ్రామోత్సవంలో పద్మశాలీయ సంఘీయులు, యువకులు భారీగా పాల్గొన్నారు. ఉత్సవాలలో నాల్గవ రోజు శనివారం రాత్రి జగజ్యోతి, ఎదురుకోల అనంత రం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం, ఐదవ రోజు ఆదివారం సాయంత్రం స్వామి దివ్య రథోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. దేవస్థాన ట్రస్టీలు, అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ సంఘీయులు ఉత్సవాలను పర్యవేక్షణ గావిస్తున్నారు. అదేవిధంగా మండలంలోని పెదపులివర్రు గ్రామంలో ఉన్న శ్రీ భూనీలా సమేత వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నిత్యహోమం, బలిహరణ, దివ్య ఆభరణ సహిత దివ్యమైన పుష్పాలంకృత అలంకారంలో వరదరాజస్వామి పేరిందేవి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఎదురుకోల ఉత్సవం అనంతరం శ్రీభూనీలా సమేత శ్రీ వరదరాజస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

ఇంటింటి ప్రచారానికి అనుమతి అవసరం : ఎస్ఐ

వేమూరు, మార్చి 22 : సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల్లో నిర్వహించే పార్టీల ప్రచారాలకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి అని వేమూరు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తాజాగా విడుదల చేసిన ఉత్తర్వులలో కొత్తగా కొన్ని నిబంధనలను జోడించడం జరిగిందన్నారు. గ్రామాల్లో అభ్యర్థి కానీ, అభ్యర్థి తరపున పార్టీ శ్రేణులు కానీ ఇంటింటి ప్రచారం వీధుల్లో నిర్వహించినట్లయితే వాటికి కూడా తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి పొందవలసి ఉందన్నారు. ప్రచారంలో మైకు వాడకానికి కూడా ప్రత్యేకమైన అనుమతి అవసరం అన్నారు. ఎన్ని రోజులు ప్రచారం జరిపినా ఒక రోజు ముందుగానే తమకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని, దానిపై డీఎస్పీ అనుమతి పొందాలని అన్నారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నగరం, మార్చి 22 : మండలంలోని నగరం 11కేవీ ఫీడర్‌కు సంబంధించిన మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరం గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఎండీ నాగూర్ మీరా తెలిపారు.

టీఎస్ ఎల్‌పీసెట్ నోటిఫికేషన్



హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (ఎస్‌బీటీఈటీ)- 'లేటరల్ ఎంట్రీ ఇన్‌టూ పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో రెండో ఏడాది ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లు సహా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీల ఆధ్వర్యంలోని సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎల్‌పీసెట్ ద్వారా డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సంబంధిత విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. లేదంటే నిర్దేశిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ అడ్మిషన్ తీసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణతతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్(డీఈటీ) అందించే బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

- ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-సివిల్) పూర్తిచేసినవారు డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) కోర్సుకు; ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్/మెషినిస్ట్ కంపోజిట్, మెషినిస్ట్ గ్రైండర్, టర్నర్, మోటార్ వెహికిల్ మెకానిక్, మెకానిక్-ఆర్ అండ్ ఏసీ) అభ్యర్థులు డిప్లొమా(మెకానికల్/ఆటోమొబైల్/మెటలర్జికల్/ప్యాకింగ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ/మైనింగ్) కోర్సులకు; ఐటీఐ(ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్) అభ్యర్థులు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)కోర్సులకు; ఐటీఐ(ఐసీటీ అండ్ సిస్టమ్ మెయింటెనెన్స్) అభ్యర్థులు డిప్లొమా(కంప్యూటర్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) కోర్సులకు అర్హులు.

ఎల్‌పీ సెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీని జతచేసి మాసబ్ ట్యాంక్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉండే తేదీ:** ఏప్రిల్ 16 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎల్‌పీసెట్ 2024 తేదీ:** మే 20
- **పరీక్ష కేంద్రం:** గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** sbtet.telangana.gov.in

మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా, డిగ్రీ

పుణెలోని తొలాని మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎంఐ)- డిగ్రీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్, బీఎస్సీ నాటికల్ సైన్స్, డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఎంయూ సెట్ 2024 అర్హత తప్పనిసరి. అలాగే సంస్థ నిర్వహించే సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (టీఎంఐఎస్‌ఏటీ) రాయాల్సి ఉంటుంది. డిప్లొమాలో ప్రవేశానికి ఈ టెస్ట్ రాయనవసరం లేదు. డిగ్రీ ప్రోగ్రామ్‌లకు అవివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మహిళలకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అడ్మిషన్ నాటికి అభ్యర్థులకు పాస్‌పోర్ట్ ఉండాలి.

బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. థియరిటికల్, ప్రాక్టికల్, వర్క్‌షాప్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. ఇంజనీరింగ్ సైన్సెస్ సబ్జెక్టులు; షిప్ బోర్డ్ మెషినరీకి సంబంధించి మెరైన్, మెకానికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

బీఎస్సీ నాటికల్ సైన్స్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇంజనీరింగ్ మేథమెటిక్స్, ఫిజిక్స్, నాటికల్ టెక్నాలజీ, నేవిగేషన్, కార్గో ఆపరేషన్స్, షిప్ మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ సంబంధిత సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో షిప్ బోర్డ్ టూల్స్, ప్రాక్టికల్ సీమన్‌షిప్, సెయిలింగ్, బోట్ హ్యాండిలింగ్‌లపై వర్క్‌షాప్ ట్రెయినింగ్ ఉంటుంది.

డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్: ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో 120 సీట్లు ఉన్నాయి. ఇది ప్రీ సీ డెక్ క్యాడెట్ కోర్సు. ఇది పూర్తయిన తరవాత ఏడాదిన్నర వ్యవధిగల ఆన్ బోర్డ్ షిప్ ట్రెయినింగ్ ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్(ఏడీఎన్‌ఎస్)ను ప్రదానం చేస్తారు. తరవాత షిప్పింగ్ కంపెనీలు ఆఫర్ చేసే ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ కూడా చేస్తే బీఎస్సీ(అప్లయిడ్ నాటికల్ సైన్స్) డిగ్రీని ఇస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

వయసు: డిగ్రీ ప్రోగ్రామ్‌లకు పురుషులు 2003 సెప్టెంబరు 1 తరవాత, మహిళలు 2001 సెప్టెంబరు 1 తరవాత జన్మించి ఉండాలి. డిప్లొమాకు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్ స్థాయిలో గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, ఐఎంయూ సెట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్‌ఏటీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

టీఎంఐ ఎస్‌ఏటీ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఎగ్జామ్. ఇందులో భాగంగా మొదట మెయిన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. తరవాత బిహేవియరల్ అసెస్‌మెంట్ ఉంటుంది. దీనికి అర్ధగంట సమయం కేటాయించారు. ఇంటర్వ్యూలో అభ్యర్థి ఆలోచన విధానం, పరిపక్వత స్థాయి, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ సామర్థ్యం తదితరాలు పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** డీఎన్‌ఎస్ ప్రోగ్రామ్‌నకు ఏప్రిల్ 30; మిగిలిన ప్రోగ్రామ్‌లకు మే 31
- **వెబ్‌సైట్:** tmi.tolani.edu

ఎన్.జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

గుంటూరులోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఏఎన్‌జీఆర్‌ఏయూ) ఆధ్వర్యంలోని ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ - ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). వీటిని తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. కోర్సులు ఏప్రిల్ నెలలో ప్రారంభమౌతాయి. కోర్సులో భాగంగా వారానికి ఒకటి చొప్పున ఏడు ఆన్‌లైన్ క్లాసెస్ ఉంటాయి. క్లాస్ వ్యవధి రెండు గంటలు. ప్రతి క్లాస్‌లో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు ఉంటాయి. అటెండెన్స్ తప్పనిసరి. కోర్సుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇస్తారు. చివరి వారంలో ఎగ్జామ్ ఉంటుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫెయిల్ అయినవారికి/హాజరు కానివారికి నెలలోపు మరల పరీక్ష ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీ/మని యార్డర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

కోర్సులు

- సేంద్రీయ వ్యవసాయం
- పుట్టగొడుగుల పెంపకం

అర్హత: తెలుగులో చదవడం, రాయడం తెలిసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులకు కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్, ఆన్‌లైన్ సదుపాయం ఉండాలి.

- **కోర్సు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **చిరునామా:** ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్, డీన్ కార్యాలయం, పరిపాలనా భవనం, ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/iq5dSZIలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

ఖాళీలు 97

ముంబయిలోని స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ- సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: జనరల్, లీగల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), రీసెర్చ్, అఫీషియల్ లాంగ్వేజ్

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 13. ప్రకటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఏప్రిల్ 13న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.sebi.gov.in/



ఇండియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 146

ఇండియన్ బ్యాంక్... దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్

విభాగాలు: క్రెడిట్, ఎస్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్‌బ్యాంక్, ఈక్విటీ డీలర్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ/ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1

వెబ్‌సైట్: www.indianbank.in/

నవ్య | చిత్రజ్యోతి

కష్టపడే వాళ్లే ఫ్యామిలీ స్టార్లు



దిల్ రాజు

తమ కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కష్టపడేవాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని నిర్మాత దిల్ రాజు అన్నారు. శుక్రవారం తెలుగు సినీ జర్నలిస్టుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా సినిమాకు 'ఫ్యామిలీస్టార్' అని డిఫరెంట్ టైటిల్ పెట్టినప్పుడు చాలా మంది ఏమనుకున్నారంటే, 'విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికే ఇలాంటి టైటిల్ పెట్టారు' అని అనుకున్నారు. ఈ టైటిల్ పెట్టడానికి ఓ కారణం ఉంది. మీరంతా మీ కుటుంబాలను వృద్ధిలోకి తెచ్చేందుకు కష్టపడుతున్నారు. అలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని చెప్పడమే మా ఆలోచన. నాలాంటి వాళ్లం సినీ రంగంలోకి వచ్చి ప్రయోజకులమై మా కుటుంబానికి సంఘంలో ఒక గౌరవం కల్పించాం. అందుకే మాలాంటి వాళ్లు, మీలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే. అదే మా ఫ్యామిలీ స్టార్ టైటిల్ కథ. అంతేగానీ విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికి ఈ సినిమా చేయలేదు. దిల్ రాజు బ్రాండ్‌తో వచ్చే ఒక కుటుంబ కథా చిత్రం అంటే చాలా గొప్పగా ఉంటుంది. ఆ పేరు నిలబెడుతుంది. మీ అందరిలోనూ ఫ్యామిలీ స్టార్లు ఉన్నారు అని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అని తెలిపారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పరశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

రస్టిక్ లవ్‌స్టోరీ.. షూట్ డైరీస్



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న 'తండేల్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంతో జరుగుతోంది. దేశభక్తి అంశాలు కలిగిన ఈ రస్టిక్ లవ్‌స్టోరీని చందు మొండేటి రూపొందిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 'తండేల్' సెట్స్‌లో నాగచైతన్య, అల్లు అరవింద్, సాయిపల్లవి, చందు మొండేటి, నిర్మాత బన్నీ వాసు ఉన్న వర్కింగ్ స్టిల్స్‌ను షూట్ డైరీస్ పేరుతో విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి ఇద్దరూ పాత్రలకు తగినట్లుగా డీ గ్లామరెస్‌గా కనిపిస్తున్నారు. ఒక ప్రామాణికంగా ఈ కథను చెప్పాలని దర్శకుడు చందు నటీనటుల గెటప్స్, కాస్ట్యూమ్స్, యాస విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తండేల్ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు.

ఈ సినిమా కోసం బరువు పెరిగి, 31 కిలోలు తగ్గా



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. మలయాళ, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగులో ప్రేక్షకులకు అందిస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో పృథ్వీరాజ్ మాట్లాడుతూ 'ఇందులో నజీబ్‌గా నేను నటించా. 2009లో ఈ సినిమా అనుకున్నాం. కానీ భారీ బడ్జెట్ అవసరం కావడంతో వెనుకంజ వేశాం. ప్రాంతీయ సినిమాల మార్కెట్ పరిధి పెరగడంతో పదేళ్ల తర్వాత 2018లో షూటింగ్ ప్రారంభించాం. ఈ చిత్రం కోసం నేను మొదట బరువు పెరిగి ఆ తర్వాత 31 కిలోలు తగ్గా. ఏడాదిన్నర పాటు అల్జీరియాలోని టిముహౌస్ అనే ప్రాంతంలో షూటింగ్ చేశాం. సహార ఎడారి మధ్యలో ఉంటుందా లోకేషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏడాదిన్నర పాటు జరిగాయి' అని వివరించారు. 'ఈ సినిమాను మొదట రాజస్థాన్ ఎడారిలో తీయాలనుకున్నాం. అయితే డీప్ డిజర్ట్ దొరకలేదు. అందుకే విదేశాలకు వెళ్లి షూటింగ్ చేశాం. ఏడారిలోనే 150 రోజులు షూట్ చేశాం. బడ్జెట్ పెరిగినా మేం అనుకున్న ఫీల్ తీసుకురాగలిగాం' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. సమావేశంలో పాల్గొన్న హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్ తను నటించిన తొలి భారతీయ చిత్రమిదని చెప్పారు. నజీబ్‌కు సాయం చేసే కీలక పాత్ర తనదని తెలిపారు. ఇలాంటి అద్భుత చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

మళ్లీ గోవాలో దేవర

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'దేవర పార్ట్ 1. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన భారీ షెడ్యూల్ ఇటీవల గోవాలో జరిగింది. తాజా షెడ్యూల్ కూడా గోవాలో మొదలైంది. నృత్య దర్శకుడు రాజు సుందరం సారథ్యంలో ఓ మాంటేజ్ సాంగ్‌ను అక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ స్టిల్స్ మీడియాకు విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్ సరికొత్త లుక్‌తో కనిపించారు. ఓ కొత్త తరహా పాత్రలో ఆయన్ని చూడడానికి అభిమానులు, ప్రేక్షకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగాన్ని విజయదశమి సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'దేవర' గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేసిందనీ, ఇండియన్ సినిమాలోనే ఎక్కువ మంది చూసిన గ్లింప్స్‌గా సరికొత్త రికార్డ్ సృష్టించిందని నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ చెప్పారు. నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.





పార్టీ కాదు పెద్ద బాధ్యత

'ఇప్పటిదాకా నా జీవితంలో శని, ఆదివారాలు రిలాక్స్ అవ్వడం అనేది లేదు. ఏదో ఒక సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండేదాన్ని. ఆ రోజున ఫ్రెండ్స్ కలుద్దామని అడిగినా వీలు కాదని చెప్పేదాన్ని. ఇక నుంచి వారాంతంలో రిలాక్స్ అవ్వడం గురించి ఆలోచిస్తున్నాను' అని అన్నారు తమన్నా. నటుడు విజయ్ వర్మతో ఆమె ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. త్వరలోనే వారిద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఈనేపథ్యంలో తన జీవితంలో సరికొత్త మార్పుకు శ్రీకారం చుడుతున్నట్లు తమన్నా తెలిపారు. 'పెళ్లంటే పార్టీ కాదు. అది చాలా పెద్ద బాధ్యత. జీవితం పూర్తి భిన్నంగా ఉంటుంది. షూటింగ్ పూర్తి చేసుకోని సాయంత్రానికల్లా ఇంటికి చేరి పిల్లలతో గడపాలి. ఎందుకంటే అదే భూమ్మీద మనం సంతోషంగా ఉండే ప్లేస్. ఇదంతా తలుచుకున్నప్పుడల్లా ఎంతో ఉద్విగ్నంగా అనిపిస్తుంది' అని తమన్నా అన్నారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/toJ68w6లో చదవండి.

డబుల్ ధమాకా



సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రం యూత్‌ను బాగా అలరించింది, ఇప్పుడు దానికి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్' చిత్రం అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుంది. సెన్సార్ ఫార్మలిటీస్ కూడా అవడంతో ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. 'డీజె టిల్లు' చిత్రం కంటే రెట్టింపు వినోదం ఈ సినిమా అందిస్తుందనీ, ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు అలరిస్తాయని దర్శకనిర్మాతలు చెప్పారు. టిల్లు డబుల్ ధమాకా ను చిత్రంలో చూడవచ్చని అన్నారు. ఈ సినిమాలో లిల్లీ పేరు కలిగిన బోల్డ్ క్యారెక్టర్‌ను అనుపమ తన కెరీర్‌లోనే తొలిసారిగా పోషించిందని చెప్పారు. లిల్లీతో టిల్లు ప్రయాణం కూడా విభిన్నంగా ఉంటుందని అన్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు.

చీరాల టీడీపీలో జోష్



కొండయ్య, ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న అభిమానులు, పార్టీ శ్రేణులు

» కూటమి అభ్యర్థిగా ఎంఎం కొండయ్య

చీరాల, మార్చి 22: చీరాల నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్యకూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు తటస్థుల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. టీడీపీలో జోష్ పెరిగింది. ఐక్య కూటమిలో ఆనందం ప్రస్ఫుటమైంది. ఇప్పటివరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంఎం కొండయ్యను కూటమి అభ్యర్థిగా శుక్రవారం టీడీపీ అధికారికంగా ప్రకటించింది.

కొండయ్య పేరు తొలి జాబితాలోనే ప్రకటిస్తారని అందరూ ఆశించారు. అయితే మొదటి రెండు జాబితాల్లో బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకర్గాలకు సంబంధించిన అభ్యర్థుల పేర్లను ప్రకటించి, చీరాలను పెండింగ్‌లో పెట్టారు. ఈక్రమంలో కొందరు ఆశావహులు తమకే టిక్కెట్ అంటూ వేసిన అడుగులతో శ్రేణుల్లో ఒకింత గందరగోళ పరిస్థితి నెలకొంది. తాజాగా మూడో జాబితాలో కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం కొండయ్య పేరును అధికారికంగా ప్రకటించటంతో ఉత్కంఠకు తెరపడింది.

కొండయ్య పేరును టీడీపీ అధికారికంగా ప్రకటించటంతో కూటమిలో ఆనందం నెలకొంది. స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్యను కలసి అభినందనలు తెలిపేందుకు మూడు పార్టీల శ్రేణులు బారులుతీరారు. పుష్పగుచ్ఛాలు ఇస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం కల్పించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు, అందుకు సహకరించిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. సేవకులుగా పనిచేద్దాం.. సత్ఫలితాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. అందరం సమిష్టిగా ముందుకు సాగుతూ భావసారూప్యం ఉన్న ప్రతి ఒక్కరిని కలుపుకుని ప్రయాణం చేద్దామని పిలుపునిచ్చారు.

కలిసొచ్చే ప్రతి ఒక్కరిని కలుపునకుపోదాం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల తోపాటు కలిసొచ్చే ప్రతి ఒక్కరిని కలుపుకుపోతూ సత్ఫలితాలు సాధిద్దామని టీడీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం తన పేరును ప్రకటించిన అనంతరం శ్రేణులతో మాట్లాడిన తరువాత మొదటగా గొల్లపాలెంలోని గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమరావారివీధిలో వినాయకుని గుడిలో పూజల్లో పాల్గొని ఆశీర్వాదం పొందారు. తదనంతరం డాక్టర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆతరువాత మసీదులో, సెయింట్‌మార్క్స్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తదనంతరం వేటపాలెం మండలం దేశాయిపేటలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీల శ్రేణులతో మాట్లాడారు.

బయోడేటా



చీరాల, మార్చి 22: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ అభ్యర్థిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్యను శుక్రవారం ఆపార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

పూర్తి పేరు: మద్దులూరి మాలకొండయ్య
పుట్టిన తేది : 22-06-1961
స్వగ్రామం: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పొన్నలూరు మండలం మాలెపాడు
విద్యార్హత: బీకాం
భార్య పేరు : బాలకొండమ్మ
సంతానం: కొడుకులు గౌరీ అమర్నాథ్, మహేంద్రనాథ్, కుమార్తె శివన్‌నారాయణదేవి
కుటుంబ నేపథ్యం: పెద్ద కొడుకు గౌరీఅమర్నాథ్ ప్రముఖ హీరో నిఖిల్ చెల్లిని వివాహమాడారు. ఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజి ట్రెజరర్‌గా చేస్తున్నారు. చిన్న కొడుకు డాక్టర్ మహేంద్రనాథ్ ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీగా ఉన్నారు. అల్లుడు గోరిపత్రి త్రినాధ్‌కుమార్ ఐఎఫ్‌ఎస్ అధికారి.
రాజకీయ నేపథ్యం: 1995 నుంచి 2001 వరకు మాలెపాడు సర్పంచ్‌గా పనిచేశారు. 2001 నుంచి 2006 వరకు కొండయ్య భార్య బాలకొండమ్మ పొన్నలూరు మండల ఎంపీపీ(టీడీపీ)గా గెలుపొంది పదవీ బాధ్యతలు నిర్వహించారు. 2006లో బాలకొండమ్మ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ రేసులో నిలిచి ఓటమి చవిచూశారు. 2009లో ఎంఎం కొండయ్య ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా(టీడీపీ) పోటీచేసి ఓటమి చెందారు. ఆ తరువాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రియల్ ఎస్టేట్, విద్యాసంస్థల నిర్వహణలో బిజీ అయ్యారు. 2022 ఏప్రిల్ 26న టీడీపీ చీరాల నియోజవకర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.

తాజాగా చీరాల నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది.



హనుమంతరావు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న రవికుమార్

మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావుకు నివాళి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 22: మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు 27వ వర్థంతి కార్యక్రమాలను శుక్రవారం యద్దనపూడి గ్రామంలో కుటుంబసభ్యులు నిర్వహించారు. ఉదయం గొట్టిపాటి హనుమంతరావు ఘాట్ వద్ద నివాళులర్పించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, దివంగత నేత గొట్టిపాటి నరసయ్య కుమారుడు భరత్, కమలకిషోర్, హనుమంతరావు సోదరుడు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు తదితరులు ఘాట్ వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మండలంలోని పలుగ్రామాల నాయకులు, గొట్టిపాటి అభిమానులు, సన్నిహితులు, మార్టూరు మండలానికి చెందినవారు యద్దనపూడి గ్రామానికి వచ్చి హనుమంతరావుతో తమకున్న పరిచయాన్ని, సాన్నిహిత్యాన్ని గుర్తుకు చేసుకున్నారు. ఆయన జీవితం నేటి తరం రాజకీయనాయకులకు ఆదర్శమని పలువురు ఆయన సహచరులు చర్చించుకున్నారు. రాష్ట్రంలోనే యద్దనపూడి అంటే హనుమంతరావు గుర్తుకు వస్తారన్నారు. అనంతరం గ్రామంలో భారీగా అన్న సంతర్పణ చేశారు.

ప్రతిభచూపిన సబ్ జూనియర్ కబడ్డీ జట్టు



మెడల్ సాధించిన ఆంధ్ర కబడ్డీ సబ్ జూనియర్ జట్టు

చినగంజాం, మార్చి 22: బీహార్ రాష్ట్రంలో ఈనెల 16 నుంచి 20 వరకు జరిగిన 33వ జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టు 3వ స్థానం స్థానించి మెడల్ కైవసం చేసుకున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు కోచ్ చెరుకూరి పుల్లయ్య శుక్రవారం తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టులో చినగంజాం మండలానికి చెందిన అట్ల అభిలాష్‌రెడ్డి, బోగిరెడ్డి భవానీశంకర్‌రెడ్డి, అట్ల అశోక్‌రెడ్డి పాల్గొని క్రీడా ప్రతిభను చాటినట్లు తెలిపారు. 17 ఏళ్ల తరువాత ఆంధ్ర సబ్ జూనియర్ కబడ్డీ జట్టు 3వ స్థానం సాధించినట్లు పుల్లయ్య తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులకు ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.మెంకటరెడ్డి, యలమంచిలి శ్రీకాంత్, ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్, అధ్యక్షుడు పి.భాస్కర్, ఎన్.అర్జునరావు, సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, కోచ్ చెరుకూరి పుల్లయ్య, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పి.రామచంద్రారావు, టి.పద్మారావు, ఎన్.శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డి, రమణారెడ్డి, ఎం.కోటేశ్వరరావు, చినగంజాం జడ్పీ పాఠశాల పీడీ గంటా అంకమ్మలు అభినందనలు తెలిపారు.

టీడీపీలో పలువురు చేరిక



క్యాంపు కార్యాలయంలో ఏలూరి సమక్షంలో చేరిన విజయ్‌నగర్ వాసులు

మార్టూరు, మార్చి 22: మార్టూరులోని విజయ్‌నగర్ కాలనీ వాసులు శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఎంపీటీసీ తన్నీరు కొండమ్మ భర్త మహేష్ తో పాటు పలువురు పార్టీలో చేరారు. వారికి మెడలో పార్టీ కండువాలు వేసి ఏలూరి స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. మొదటి నుంచి బీసీ ల సంక్షేమం కోసం కృషి చేసింది తెలుగుదేశం పార్టీనేనని ఏలూరి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను మేనిఫెస్టోలో ఏర్పాటుచేయడానికి బీసీ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశమే ప్రధాన కారణమన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని చెప్పారు. మరలా చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కార్యకర్తలందరూ పట్టుదలతో పని చేయాలన్నారు. అందరూ సమిష్టిగా పనిచేసి చంద్రబాబును సీఎంగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఎన్నికలు ముగిసేంతవరకు పార్టీ కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో తన్నీరు బూదయ్య కొమెర వీరబ్రహ్మం, కొమెర శ్రీను, తొగటి వెంకటసుబ్బయ్య, తుమ్మల వెంకట్రావు, నల్లూరి అంజిబాబు, తన్నీరు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొనడంతో కంటైనర్ బోల్తా

మేదరమెట్ల , మార్చి 22: జాతీయ రహదారిలోని మేదరమెట్ల బైపాస్‌లో కంటైనర్ లారీని మరో లారీ ఢీకొనడంతో బోల్తాపడింది. శుక్రవారం వేకువజామున విజయవాడ నుంచి ప్లైవుడ్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీని మరో లారీ పక్కనుంచి ఢీకొన్న సంఘటనలో కంటైనర్ లారీ డివైడర్‌పై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన సిబ్బంది రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వెంకటేష్



మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద పూజల్లో కరణం వెంకటేష్ తదితరులు

చీరాల, మార్చి 22: స్థానిక ముత్యాలపేటలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టువద్ద శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ పాల్గొన్నారు. అంతకుముందు ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఓ రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు

» రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» ఇతర జిల్లాల ఓట్లు అద్దంకి నియోజకవర్గంలో చేర్పు, అధికారుల తీరుపై వినతిపత్రాలు అందజేత

అద్దంకి, మార్చి 22: ఇతర జిల్లాల ఓట్లను అద్దంకి నియోజకవర్గంలో దొడ్డిదారిన చేర్చటం, విచారణలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించటం, పోలీస్ అధికారులు ఒక రాజకీయపార్టీకి కొమ్ముకాస్తూ వ్యవహరించటం తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కలిసి వినతిపత్రాలు అందజేశారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం దొడ్లేరుకు చెందిన 19 ఓట్లను నిబంధనలకు విరుద్ధంగా ఆధార్‌కార్డుల అడ్రస్‌లను మార్చుచేసి అద్దంకి నియోజకవర్గంలో ఓటర్లుగా చేర్చటం, దీనికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రవికుమార్ కోరారు. గతంలో చేసిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించగా, క్షేత్ర స్థాయి అధికారులు నీరుగార్చే విధంగా వ్యవహరించి తప్పుడు నివేదిక ఇవ్వటంపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్లకు తెలియకుండా తప్పుడు స్వీయ ఫాం- 7లు దాఖలు చేసిన వ్యక్తులపై కూడా చర్యలు చేపట్టాలని కోరినట్లు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న సుమారు వెయ్యి మందికి పైగా ఓటర్ల ఓట్లు తొలగింపునకు ఫాం- 7లు దాఖలుపై అధికారులు విచారణ చేశారు. ఓటర్లకు తెలియకుండానే ఫాం- 7లు దాఖలు చేసినట్టు తేలిన విషయాన్ని కూడా రవికుమార్ వివరించారు.

బల్లికురవ మండలంలో ఓ రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ టీడీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తుంది. బల్లికురవలో కిరాణా దుకాణంలో ఉన్న వృద్ధుడు శానంపూడి హనుమంతరావును కొట్టడంతో పాటు బెదిరించిన ఎస్సై నాగశివారెడ్డిపై తీరు పై ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనకు సంబంధించి సీసీ పుటేజ్ తొలగించకపోతే రౌడీషీట్ తెరుస్తానని బెదిరించిన విషయం కూడా వివరించారు. ఇందుకుసంబంధించిన ఆధారాలను కూడా అందజేసినట్లు తెలుస్తుంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ పోలీస్ స్టేషన్‌లో గ్రామ వైసీపీ నాయకుడు చేత సన్మానం చేయించుకున్న విషయాన్ని కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకుపోయారు. వెంటనే ఎస్సై నాగశివారెడ్డి పై చర్యలు తీసుకొని ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

అద్దంకి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న శివరామకృష్ణారెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వివిధ ప్రాంతాలలో గత నాలుగున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ బదిలీ చేయకుండా ఉంచటంపై కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

పేదల నడ్డివిరిచిన జగన్

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజం



మేదరమెట్ల టీడీపీ నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మేదరమెట్ల , మార్చి 22: విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు నిత్యావసరాల ధరలు విపరీతంగా పంచి జగన్‌మోహన్‌రెడ్డి పేదలపై పెనుభారం మోపారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం ముప్పవరంలో పార్టీ కార్యాలయంలో కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, తిమ్మనపాలెం, అనమనమూరు, తమ్మవరం, యర్రబాలెం, బొడ్డువానిపాలెం, పి.గుడిపాడు గ్రామాల పార్టీ శ్రేణులతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ఓటరు జాబితా పట్ల అప్రమత్తత, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామలలోని తాజా రాజకీయ పరిస్థితుల గురించి ఆయన చర్చించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 51 రోజులలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఖాయమన్నారు. జగన్‌రెడ్డి అహంకారమే ఆ యన రాజకీయ అంతానికి దారితీసే పరిస్థితి నెలకొందన్నారు. వ్యవస్థలను మెనేజ్ చేయడంతో పాటు రాష్ట్రంలో ఉన్న పరిపాలనను భ్రష్టు పట్టించారన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి మచ్చుకు కూడా కనిపించలేదన్నారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని దివాళా తీయించడంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదుచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు యువతకు ఉన్నత విద్య అవకాశాలతో పాటు ప్రపంచంతో పోటీపడే నైపుణ్యాలను నేర్పించారన్నారు. అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల బూత్ కన్వీనర్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, కుటుంబసారథులు, పేజి నేస్తం సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

28న దేవతామూర్తుల ప్రతిష్ఠ

» జాగర్లమూడివారిపాలెంలో సర్వాంగ సుందరంగా కోదండ రామచంద్రస్వామి ఆలయ నిర్మాణం



నల్లరాతితో నిర్మితమైన కోదండ రామచంద్రస్వామి ఆలయం

పంగులూరు, మార్చి 22: మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామంలో శ్రీహనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. సుమారు మూడు కోట్ల వ్యయ అంచనాతో గ్రామస్థులు నాలుగేళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజలు అందించిన భారీ విరాళాలతో ఆలయ అభివృద్ధి కమిటీ నిర్మాణం చేపట్టారు. దేవతా మూర్తులు కొలువు దీరనున్న ప్రధాన ఆలయం పూర్తిగా నల్లరాతితో నిర్మించగా, ఆలయ ముఖమండపం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. నూతన ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠా మహోత్సవం ఈనెల 28వ తేదీ ఉదయం 7.40 గంటల నుంచి 8.20 గంటల మధ్య నిర్ణయించిన దివ్య ముహూర్తంలో జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 26 నుంచి వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ సమీపంలో క్రతువు నిర్వహణకు అవసరమైన యాగశాల నిర్మితంకాగా, ప్రముఖ వేద పండితులు శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు శాస్త్రోక్తంగా ఈప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. దేవతామూర్తుల ప్రతిష్ఠానంతరం ఈ మహోత్సవాన్ని తిలకించడానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, మార్చి 22: మార్టూరులోని బొడ్డురాయి సెంటరు సమీపంలో ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. గత రెండు రోజుల నుంచి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు అర్చకులు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోయుక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. అలాగే వినాయకుని విగ్రహం, గోపుర కలశం , మహావతార్ బాబాజీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమాలను కారంచేటి వెంకటపిచ్చయ్య శాస్త్రి, కారంచేటి వెంకటప్రసన్న అచ్యుత్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పొత్తూరి వెంకటరావు, శ్రీరాం శేషగిరిరావు, గుడివాడ సుబ్రమణ్యం, కె.వెంకట మారుతిరావు, చేబ్రోలు నారాయణ మూర్తి, పొత్తూరి శివ, గుర్రం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి

గుండ్లకమ్మ నది సంరక్షణలో అధికారులు విఫలం



సేవ్ గుండ్లకమ్మ కరపత్రాలు చూపిస్తున్న పలు ప్రజా సంఘాల ప్రతినిధులు

అద్దంకి, మార్చి22: గుండ్లకమ్మ నదిని సంరక్షించటంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పొల్యూషన్ కంట్రోల్, రివర్ కన్జర్వేషన్ కమిటీ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు అన్నారు. గుండ్లకమ్మ నది సంరక్షణపై ఫ్రీలీగల్ ఎయిడ్ షేక్ మహ్మద్ రఫీకి శుక్రవారం కోర్టు ఆవరణలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ జీవనదిగా ఉన్న గుండ్లకమ్మ నదిని అన్నివిధాలుగా కాపాడాలని పలుశాఖల అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గుండ్లకమ్మ నది డంపింగ్ యార్డు గా మారిందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలతో 1985లో నిర్మించిన బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోతే గ్రీన్ ట్రిబునల్‌కు వెళతామని చెప్పారు. గుండ్లకమ్మ నది దుస్థితిపై పలుసార్లు ప్రచురితమైన క్లిప్పింగ్‌లను కూడా వినతిపత్రంతో జతచేశారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల ప్రతినిధులు మన్నం త్రిమూర్తులు, జ్యోతి చంద్రమౌళి, ఏజీపీ యర్రమోతు రమేష్, అన్నమనేని వెంకటరావు, చెన్నుపాటి రామాంజనేయులు, చిన్ని మురళీకృష్ణ, మంగమూరి చిరంజీవి, వారణాసి రఘురామశర్మ, పుట్టంరాజు తులసీదాస్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

చీరాలటౌన్, మార్చి 22: విద్యుత్ అధికారులు కచ్చితంగా ఎన్నికల నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎస్ఈ కె.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలన్నారు. వినియోగదారుల నుంచి బకాయిలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జాన్ థామస్, అన్ని డివిజన్‌లకు చెందిన డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పంగులూరు: ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల గుర్తులు, వ్రాతలు, నాయకుల ఫొటోలు కలిగిన ఫ్లెక్సీలు పెట్టడం, జండాలు కట్టడం, గోడలమీద బొమ్మలు వేయడం, ప్రచారం కోసం వాహనాలు ఉపయోగించరాదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున చీరాల డీఎస్పీ వ్రాతపూర్వ అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు చేయరాదని చెప్పారు. మైక్ వాడేందుకు అనుమతి పొంది ఉండాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

మార్టూరు, మార్చి 22: మార్టూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఎంఈసీసీ తూర్పు బజారు ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ సాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 48 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ.20,116, రూ.15,116, రూ.10,116 అందజేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మార్చి 22: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగపర్చుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో ఏ.కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాజులపాలెంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జయసింహా ఆరోగ్యపరంగా మహిళలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రమాదేవి, బి.ఇందిరమ్మ, ఏ.అరుణాదేవి, కె.ఇందిర, ఎస్.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మార్చి 22: మార్టూరు పంచాయతీ పరిదిలోని బండి నాగేశ్వరరావు కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు బండి అయ్యన్న సతీమణి చింపిరమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శుక్రవారం ఆమె వర్ధంతి సందర్భంగా టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారి ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బండి నాగేశ్వరరావు, తాటి నాగేశ్వరరావు, కమ్మ శివనాగేశ్వరరావు, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 22: ఎన్నికలు నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శికుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండల పరిధిలోని ఈపూరుపాలెం సెంటర్‌లో ప్రజలతో అవగాహన కార్యక్రమం, నేర నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడరాదని సూచించారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం

పర్చూరు, మార్చి 22: బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆపార్టీ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మూడో జాబితాలో చీరాల నియోజకవర్గ అభ్యర్థిగా ఎంఎం కొండయ్యను ఎంపిక చేయటం పట్ల స్థానిక పార్టీ కార్యాలయంలో సీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. కొండయ్యకు సీటు కేటాయించటంతో సహకారం అందించిన బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మానం హరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, గనిపిశెట్టి కోటేశ్వరరావు, గ్రంధి రాజేంద్ర, నూతనపాటి ఇజ్రాయిల్, షేక్ గౌస్, హైటెక్ సుభానీ, పఠాన్ బాజీ, దరియా, చేజర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధం

కుంకులమర్రు(పర్చూరు), మార్చి 22: కారంచేడు మండలం కుంకలమర్రులో జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాకాని విష్ణు కాలువగట్టు మసీదు సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసుకున్న గడ్డివామి అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. మంటలు చెలరేగటంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చీరాల అగ్నిమాపక సిబ్బంది మంటలకు ఆర్పేప్రయత్నం చేయగా అప్పటికే కాలిబూడిదయింది. ఈప్రమాదంలో రూ.1.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా, మరి ఇతర కారణాల వల్ల అగ్నిప్రమాదం జరిగిందన్న విషయం తెలియాల్సి ఉంది.

ఇడుపులపాడులో పోలీసుల కవాతు

ఇంకొల్లు, మార్చి 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బీఎస్‌ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది మండలంలోని ఇడుపులపాడులో శుక్రవారం రాత్రి కవాతు నిర్వహించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించినట్టు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.

రోటరీ వితరణ

పర్చూరు, మార్చి 22: మెరుగైన పారిశుధ్య కార్యాక్రమాలు చేపట్టేవిధంగా రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.70వేలు విలువ చేసే డస్టబిన్‌లను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. స్థానిక రోటరీ భవనంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు నేతృత్వంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ రోటరీ సభ్యులు పాబోలు ఉదయ భాస్కర్, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, మార్చి 22: ఇంకొల్లులో నేత్రదానం జరిగింది. గొల్లపాలెం గ్రామానికి చెందిన కోటపాటి శ్రీనివాసరావు(57) మృతి చెందగా, శుక్రవారం రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుటుంబసభ్యులు సుధారాణి, ఈశ్వర్, ప్రణీతలను రోటరీ సభ్యులు అభినందించారు.

కూటమి సంబరాలు

చీరాల, మార్చి 22: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఎంఎం కొండయ్యను శుక్రవారం ప్రకటించంతో ఆయాపార్టీల శ్రేణులు స్థానిక గడియార స్తంభం సెంటర్లో పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి పెట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్, జనసేనాని పవన్‌కల్యాణ్‌ల చిత్రాలతో యువకులు సందడి చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకొన్న ఎస్పీ కార్యాలయ ఎస్ఐ

బల్లికురవ, మార్చి 22: బల్లికురవ పోలీసు స్టేషన్‌లో రికార్డు అయిఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌లను శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ స్వాధీనం చేసుకొన్నారు. ఎన్నికల కోడ్ అమలులోఉన్నా బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నాగశివారెడ్డిని కొమ్మినేనివారిపాలెం వైసీపీ నేత కలిసి శాలువాలతో సత్కరించిన్నట్లు పత్రికలలో వచ్చిన కథనాలపై ఎస్పీ స్పందించారు. బల్లికురవ పోలీసుస్టేషన్‌లో గత రెండు రోజుల నుంచి రికార్డు అయిన సీసీ ఫుటేజ్ వివరాలను తనిఖీచేసి వెంటనే వాటిని తీసుకోవాలని ఆదేశించా రు. దీంతో బాపట్ల నుంచి వచ్చిన ఎస్ఐ సీసీ ఫుటేజ్ హార్డు డిస్కును తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, మార్చి 22: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి భారతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కూకట్లపల్లిలో జరిగిన వైద్య శిబిరంలో 106 మందికి పరీక్షలు చేశారు.సీజనల్ జ్వరాలు అధికంగా ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు వైద్య శిబిరం నిర్వహించినట్టు వైద్యాధికారిణి తెలిపారు.